మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శుక్రవారం FRIDAY 24-10-2025 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 ‖ సంచిక: 114 Issue: 114

24 అక్టోబర్ 2025 - శుక్రవారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం - శరత్ ఋతువు కార్తీక మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:15 సూర్యాస్తమయం - సా. 5:45 తిథిః తదియ రా. 1:19o వరకు తరువాత చవితి సంస్కృత వారం భృగు వాసరః నక్షత్రం అనురాధ ఉ. 7:44o వరకు యోగం సౌభాగ్య తె. 5:52o వరకు కరణం తైతుల మ. 12:03 వరకు గరజి రా. 1:19o వరకు వర్జ్యం ఉ. 9:21 నుండి ఉ. 11:09 వరకు దుర్ముహూర్తం ఉ. 8:33 నుండి ఉ. 9:19 వరకు మ. 12:23 నుండి మ. 1:09 వరకు రాహుకాలం ఉ. 10:34 నుండి మ. 12:00 వరకు యమగండం మ. 2:52 నుండి సా. 4:18 వరకు గుళికాకాలం ఉ. 7:41 నుండి ఉ. 9:07 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:39 నుండి తె. 5:27 వరకు అమృత ఘడియలు రా. 7:53 నుండి రా. 9:41 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:37 నుండి మ. 12:23 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

Published from Jagitial
www.evarthalu.com


## జూబ్లీహిల్స్ బరిలో 81 మంది

### నేటి వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు




హైదరాబాద్, అక్టోబర్ 23 (ఈవార్తలు): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో స్క్రూటినీ పూర్తయ్యింది. 211 మంది అభ్యర్థులు 321 నామినేషన్లు దాఖలు చేశారు. 17 గంటల పాటు స్క్రూట్నీ నిర్వహించగా.. 130 మంది అభ్యర్థులు వేసిన 186 నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. స్క్రూటినీ అనంతరం 81 మంది వేసిన 135 నామినేషన్లు ఆమోదించినట్టు రిటర్నింగ్ అధికారి తెలిపారు. అక్టోబర్ 23న ఎవరూ నామినేషన్ విత్ డ్రా చేసుకోలేదు. శుక్రవారం వరకు 24 వరకు విత్ డ్రాలకు అవకాశం ఉంది. శుక్రవారం సాయంత్రం 3 గంటల తర్వాత బరిలో ఎంత మంది నిలుస్తారో వారికి గుర్తులు కేటాయించనున్నారు.

## ఈవీఎంలతోనే పోలింగ్

### హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి ఆర్వీ కర్ణన్



జూబ్లీహిల్స్, అక్టోబర్ 23 (ఈవార్తలు): జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక బరిలో ఎంత మంది అభ్యర్థులు బరిలో ఉన్నా పోలింగ్ కు ఈవీఎంలే ఉపయోగిస్తామని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి ఆర్వీ కర్ణన్ తెలిపారు. 64 మంది అభ్యర్థులు దాటితే ఎం3 ఈవీఎంలు ఉపయోగిస్తామని.. బ్యాలెట్ పేపర్స్ ఓటింగ్ ఉండబోదన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు 211 మంది అభ్యర్థులు 321 సెట్ల నామినేషన్ దాఖలు చేశారు. సరైన ఫార్మాట్ లో పత్రాలు సమర్పించకపోవడం, వివరాలు తరువాయి 2 వ పేజీలో...

## రౌడీ షీటర్‌కు కాంగ్రెస్ టికెట్

### ఈ ఎన్నిక హైదరాబాద్ ప్రజల విజ్ఞతకు పరీక్ష.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్



సిద్దిపేట, అక్టోబర్ 23 (ఈవార్తలు): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారం వేడెక్కుతున్న తరుణంలో బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఒక రౌడీ షీటర్‌కు టికెట్ ఇచ్చిందని తీవ్రంగా ఆరోపించిన ఆయన, విజ్ఞులైన జూబ్లీహిల్స్ ప్రజలు అతడిని చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ ఎన్నిక హైదరాబాద్ నగర ప్రజల తెలివితేటలకు, విజ్ఞతకు ఒక కఠిన పరీక్షగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల సన్నాహక సమావేశంలో కార్యకర్తలను తరువాయి 2 వ పేజీలో...



## పదో తరగతి పరీక్ష ఫీజు షెడ్యూల్ విడుదల

హైదరాబాద్, అక్టోబర్ 23 (ఈవార్తలు): తెలంగాణలో పదో తరగతి ఫైనల్ పరీక్ష ఫీజు చెల్లింపు తేదీలను డైరెక్టర్ స్కూల్ ఎడ్యుకేషన్ ప్రకటించింది. అక్టోబరు 30వ తేదీ నుంచి నవంబర్ 13 లోపు పాఠశాల హెడ్‌మాస్టర్లకు విద్యార్థులు ఫీజు చెల్లించాలని తెలిపింది. హెచ్ఎంలు ఆన్‌లైన్ ద్వారా నవంబర్ 14 లోపు ఫీజు చెల్లింపు చేయాలని, విద్యార్థుల డేటాను నవంబర్ 18 లోపు డీఈవోలకు అందించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. రూ.50 ఆలస్య రుసుముతో నవంబర్ 29 వరకు, రూ.200 ఆలస్య రుసుముతో డిసెంబర్ 2 నుంచి 11వ తేదీవరకు, రూ.500 ఆలస్య రుసుముతో డిసెంబరు 15 నుంచి 29 వరకు పదో తరగతి పరీక్ష ఫీజు చెల్లించేందుకు విద్యార్థులకు అవకాశం కల్పించారు.

# బాండ్స్.. బంగారం!

## గోల్డ్ బాండ్లతో భారీ లాభం.. రూ.100కు రూ.325 రాబడి

### 8 ఏళ్లలోనే 225 శాతం లాభం.. 2017-18 సిరీస్ పెట్టుబడిదారులకు పండగ




సావరిన్ గోల్డ్ బాండ్స్ 2017-18 సిరీస్ 4లో పెట్టుబడి పెట్టినవారు ఇప్పుడు పండుగ చేసుకుంటున్నారు. ఎందుకంటే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రాముకు రూ.12,704 తుది రిడంప్షన్ ధరను ప్రకటించింది. అంటే 8 సంవత్సరాల కాలంలో 325 శాతం రాబడిని అందిస్తోంది. వాస్తవానికి అక్టోబర్ 2017లో గ్రాముకు రూ.2,987 వద్ద జారీ చేసిన బాండ్లు ఇప్పుడు రూ. 9,717 లాభాన్ని ఇచ్చాయి. దీనికి ఆర్నెళ్లకోసారి చెల్లించే 2.5% వార్షిక వడ్డీ అదనం.

ముంబై: 2025 అక్టోబర్ 17, 20, 22 తేదీల్లో ఇండియా బులియన్ అండ్ జ్యువెలర్స్ అసోసియేషన్ ప్రచురించిన బంగారం సగటు ముగింపు ధర (999 స్వచ్ఛత) ఆధారంగా రిడంప్షన్ ధరను నిర్ణయించారు. దిగుమతులను తగ్గించడంతోపాటు.. బంగారంపై పెట్టుబడులను డిజిటల్‌వైపు మళ్లించే లక్ష్యాలతో తీసుకొచ్చిందే సావరిన్ గోల్డ్ బాండ్ పథకం. పసిడిపై పెట్టుబడులను డిజిటల్ రూపంలోకి మళ్లించడంలో కేంద్రం ఒక విధంగా సక్సెస్ అయింది. కానీ, బంగారం దిగుమతులు మాత్రం తగ్గలేదు. ఎస్‌జీబీలకు ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది. ప్రభుత్వ హామీతో కూడిన సాధనం కావడంతో పెట్టుబడులకు ఎక్కువ మంది ఆసక్తి చూపించారు. దీంతో ఎస్‌జీబీల రూపంలో ప్రభుత్వంపై చెల్లింపుల భారం పెరిగిపోయింది. దీంతో సావరిన్ గోల్డ బాండ్ల జారీని ప్రభుత్వం నిలిపేసింది. సావరిన్ గోల్డ్ బాండ్‌లు అందుబాటులో లేనప్పటికీ డిజిటల్ గోల్డ్‌లో పెట్టుబడులు పెట్టాలనుకునేవారికి ఇప్పటికీ ఇతర మార్గాలు ఉన్నాయి. గోల్డ్ ఈటీఎఫ్‌లలో పెట్టుబడి పెట్టవచ్చు. వీటిని మ్యూచువల్ ఫండ్ సంస్థలు జారీ చేస్తాయి. వీటిలో పెట్టిన పెట్టుబడులు స్టాక్ ఎక్స్ఛేంజ్‌లలో షేర్లలా ట్రేడ్ అవుతాయి. గోల్డ్ ఈటీఎఫ్ ధర బంగారం మార్కెట్ ధరకు నేరుగా అనుసంధానమై ఉంటుంది. బంగారం ధర పెరిగితే, ఈటీఎఫ్ యూనిట్ విలువ కూడా పెరుగుతుంది. 2017-18లో సావరిన్ గోల్డ్ బాండ్ ఇష్యూ ధర గ్రాముకు రూ. 2,971గా నిర్ణయించింది. డిజిటల్ పేమెంట్ చేసిన వారికి రూ.50 డిస్కౌంట్‌తో రూ. 2,921 కే గ్రాము వచ్చింది. ప్రస్తుత తరువాయి 2 వ పేజీలో...




## రక్షణకు 79 వేల కోట్లు

### ప్రతిపాదనలకు కేంద్రం ఆమోదం

భారత త్రివిధ దళాల సామర్థ్యాలను మరింత బలోపేతం చేసే దిశగా రక్షణశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. రూ.79 వేల కోట్ల వ్యయంతో ఆయుధాలు, సైనిక పరికరాల కొనుగోలుకు పచ్చజెండా ఊపింది. నాగ్ క్షిపణి వ్యవస్థ, టార్పిడోలు, ఎలక్ట్రానిక్ నిఘా వ్యవస్థల వంటివి ఇందులో ఉన్నాయి. రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలో సమావేశమైన డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ సంబంధిత ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది.

న్యూఢిల్లీ: డీఏసీ ఆమోదించిన ప్రతిపాదనల్లో ల్యాండింగ్ ప్లాట్‌ఫాం డాక్స్, అడ్వాన్స్‌డ్ లైట్‌వెయిట్ టార్పిడోలు, 30 ఎంఎం నేవల్ సర్ఫేస్ గన్స్ (ఎన్ఎస్‌జీ), ఎలక్ట్రో ఆప్టికల్ ఇన్‌ఫ్రారెడ్ సెర్చ్, ట్రాక్ సిస్టమ్, హై మొబిలిటీ వెహికల్స్, కొలాబరేటివ్ లాంగ్ రేంజ్ టార్గెట్ సాచురేషన్/డిస్ట్రక్షన్ సిస్టమ్ వంటివి ఉన్నాయి. 'ఆత్మనిర్భర్ భారత్'కు ఇది తరువాయి 2 వ పేజీలో...



## భారత సైన్యంలో 'భైరవ్'

### తొలి బెటాలియన్ రెడీ

భారత సైన్యంలో ఆధునిక పరిజ్ఞానం, శక్తిమంతమైన ఆయుధాలతో శరవేగంగా స్పందించే 'భైరవ్' బెటాలియన్‌లు సిద్ధమవుతున్నాయి. నవంబర్ 1న తొలి బెటాలియన్ సైన్యంలో మోహరించనున్నట్లు భారత సైన్యం (పదాతిదళ) డైరెక్టర్ జనరల్ లెఫ్టినెంట్ అజయ్ కుమార్ వెల్లడించారు.

2



## అగ్నివీర్ రిటెన్షన్.. 75 శాతం

### ఆర్మీ కమాండర్ల భేటీలో నిర్ణయం

ఇండియన్ ఆర్మీలో అగ్నివీరుల నిలుపుదల(రిటెన్షన్) రేటును భారీగా పెంచే ప్రతిపాదనపై త్వరలో తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం కేవలం 25 శాతంగా ఉన్న ఈ రేటును ఏకంగా 75 శాతం వరకు పెంచాలని సైన్యం యోచిస్తోంది.

2

## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.12,508 |
| వెండి (గ్రాము): | రూ.175 |
| ప్లాటినం (గ్రాము): | రూ.4,322 |

## ఇద్దరు పిల్లల నిబంధన రద్దు

### రాష్ట్ర కేబినెట్ కీలక నిర్ణయం

ఇద్దరి కన్నా ఎక్కువ పిల్లలున్నా పోటీకి అర్హులే.. పంచాయతీరాజ్ చట్టంలో కీలక సవరణలు

ఆర్డినెన్స్ ద్వారా చట్ట సవరణకు ఆమోదం.. త్వరలో అమలులోకి రానున్న కొత్త విధానం




హైదరాబాద్, అక్టోబర్ 23 (ఈవార్తలు): స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు తెలంగాణ ప్రభుత్వం భారీ ఊరట కల్పించింది. ఇద్దరి కన్నా ఎక్కువ పిల్లలు ఉన్నవారు ఎన్నికల్లో పోటీకి అనర్హులు అనే నిబంధనను రద్దు చేయాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన గురువారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు ఆమోద ముద్ర వేశారు. ప్రస్తుతం అమల్లో ఉన్న ఈ నిబంధన వల్ల ఇద్దరి కన్నా -2 వ పేజీలో...



## హైకోర్టు తీర్పు తర్వాతే..!

### స్థానిక ఎన్నికలపై నిర్ణయం.. మంత్రి పొంగులేటి స్పష్టీకరణ

హైదరాబాద్, అక్టోబర్ 23 (ఈవార్తలు): హైకోర్టు తీర్పు తర్వాతే స్థానిక ఎన్నికలపై కేబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంత్రివర్గ సమావేశం అనంతరం కేబినెట్ నిర్ణయాలను మీడియాకు వెల్లడించారు. 'బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోంది. హైకోర్టులో వచ్చేనెల 3న కేసు విచారణ ఉంది. ఉన్నత న్యాయస్థానం తీర్పు వచ్చిన తర్వాత కేబినెట్‌లో చర్చించి స్థానిక ఎన్నికలపై నిర్ణయం తీసుకుంటాం. వచ్చేనెల తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



మనిషి జీవిత కాలాన్ని 250 ఏళ్లకు పెంచే ఔషధాన్ని జపాన్ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. వయసును పెంచే కణాలపై ప్రభావం చూపి, డీఎన్ఏను రిపేర్ చేసేలా ఆ ఔషధాన్ని అభివృద్ధి చేశామని ఒసాకా యూనివర్సిటీ శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.

## రిజ్వీ రిజైన్డ్



ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సయ్యద్ అలీ ముర్తజా రిజ్వీ వీఆర్ఎస్

అభ్యర్థనను తిరస్కరించాలంటూ సీఎస్‌కు మంత్రి జూపల్లి లేఖ

మంత్రి అభ్యంతరాలను పట్టించుకోకుండా వీఆర్ఎస్‌కు సర్కారు ఆమోదం

అధికారులను కాంగ్రెస్ ప్రభుత్వం వేధిస్తోందంటూ బీఆర్ఎస్ తీవ్ర ఆరోపణ

రిజ్వీ స్థానంలో రెవెన్యూ కార్యదర్శిగా రఘునందన్ రావుకు అదనపు బాధ్యతలు

హైదరాబాద్, అక్టోబర్ 23 (ఈవార్తలు): తెలంగాణ ప్రభుత్వంలో ఒక సీనియర్ ఐఏఎస్ అధికారికి, మంత్రికి మధ్య జరిగిన తీవ్ర వివాదం ఆయన స్వచ్ఛంద పదవీ విరమణకు (వీఆర్ఎస్) దారితీసింది. రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో తలెత్తిన విభేదాల కారణంగా వాణిజ్య పన్నులు, ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శిగా పనిచేస్తున్న సయ్యద్ అలీ ముర్తజా రిజ్వీ బుధవారం తన పదవికి వీఆర్ఎస్ తీసుకున్నారు. నిజాయతీపరుడైన అధికారిగా పేరున్న రిజ్వీ, వ్యక్తిగత కారణాలతోనే పదవీ విరమణ చేస్తున్నట్లు పేర్కొన్నప్పటికీ, దీని వెనుక లిక్కర్ హోలోగ్రామ్ టెండర్ల వివాదం ఉన్నట్లు స్పష్టమవుతోంది. మద్యం సీసాలపై అతికించే హై-సెక్యూరిటీ హోలోగ్రామ్‌ల టెండర్ల ప్రక్రియను -2 వ పేజీలో...



## నమాజ్ నేర్చుకుంటేే పెళ్లి చేసుకుంటా

పెళ్లికి మతం మారాలంటూ ప్రియుడి కుటుంబం ఒత్తిడి

ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం.. పెళ్లిపేరుతో శారీరక సంబంధం

వేరే యువతితో ప్రియుడికి నిశ్చితార్థం జరగడంతో వెలుగులోకి మోసం

లవ్ జిహాద్ ఆరోపణలతో రంగంలోకి హిందూ సంఘాలు, బీజేపీ

బెంగళూరు: పెళ్లి చేసుకోవాలంటే తప్పనిసరిగా ఇస్లాం మతంలోకి మారాలని ప్రియుడి కుటుంబసభ్యులు ఒత్తిడి చేశారంటూ ఓ యువతి పోలీసులకు ఫిర్యాదు చేయడం బెంగళూరులో తీవ్ర కలకలం రేపింది. ప్రేమ, పెళ్లి పేరుతో తనను లైంగికంగా వాడుకున్నాడని ఆరోపిస్తూ బాధితురాలు గురువారం హెచ్ఎస్ఆర్ లేఅవుట్ పోలీస్ స్టేషన్‌లో మహమ్మద్ ఇషాక్‌పై కేసు పెట్టింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, బాధితురాలికి, మహమ్మద్ ఇషాక్‌కు 2024 అక్టోబర్ 17న ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయం తరువాయి 2 వ పేజీలో...

# వేధింపుల వల్లే వీఆర్ఎస్‌లు

## మంత్రి టార్చర్ భరించలేకే రిజ్వీ రాజీనామా.. రేవంత్ రెడ్డి బలహీన ముఖ్యమంత్రి .. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సీఎం రేవంత్ రెడ్డి పాలనపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీలు కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ పరిపాలన అవినీతి కంపు రాష్ట్ర వ్యాప్తంగా కొడుతుందన్నారు. తెలంగాణను తాము అగ్రికల్చర్‌లో అగ్రస్థానంలో నిలిపితే.. కాంగ్రెస్ పార్టీ మాత్రం రాష్ట్రంలో గన్ కల్చర్ తీసుకువచ్చిందని విమర్శించారు.**

**రాజకీయ జీవితంలో ఇంతటి బలహీన ముఖ్యమంత్రిని చూడలేదన్నారు. ఒక మంత్రి ఇంటికి టాస్క్ ఫోర్స్ పోలీసులను ముఖ్యమంత్రి పంపడం, నిందితుని స్వయంగా మంత్రి తన కారులో తీసుకొని మాయమైపోవడం ఎప్పుడూ చూడలేదన్నారు. స్వయంగా ముఖ్యమంత్రి అనుచరుడు, అప్పుడు రోహిన్ రెడ్డి పై మంత్రి కూతురు ఆరోపణలు చేస్తే కనీసం విచారణకు ఆదేశించలేదన్నారు.**



హైదరాబాద్, అక్టోబర్ 23 (ఈవార్తలు): రేవంత్ రెడ్డికి సిగ్గు ఉంటే కనీసం ఈ అంశం పైన స్పందించాలన్నారు. రేవంత్ రెడ్డి అంటే బలహీన ముఖ్యమంత్రిని ప్రపంచంలో ఎప్పుడూ చూడలేదని ఏకీపారేశారు. స్వయంగా నీపైన మంత్రులు.. ఆరోపణలు చేస్తే ఆ మంత్రి నీ పక్కకు జరపలేవన్నారు. 'స్వయంగా నీ మంత్రులు మీపై ఆరోపణలు చేస్తున్న కనీసం వారిని ముట్టుకోలేని బలహీన ముఖ్యమంత్రివి నువ్వు' అంటూ ఎద్దేవా చేశారు. కనీసం సిగ్గు ఉంటే పాలనపై పట్టు నిరూపించుకోవాలన్నారు. ఇటీవల కాంగ్రెస్ మంత్రుల గొడవలు చూస్తుంటే.. తన పరిపాలన పైన మంత్రుల పైన ఎలాంటి పట్టు లేదని తేలిపోయిందన్నారు. దావూద్ ఇబ్రహీం లాంటి ముఖ్యమంత్రిని తరిమేసుకుంటేనే తెలంగాణ పట్టిన శని పోతుందన్నారు. కాంగ్రెస్ అవినీతికి ప్రభుత్వ అధికారులు కూడా భయపడుతున్నారన్నారు. వీరి వాటాల పంచాయతీలో మాకు భాగస్వామ్యం వద్దు, మాకు సంబంధం లేదు అంటూ అధికారులు పారిపోతున్నారన్నారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను తప్పుడు పనులు చేయమని వేధించడం వల్లనే వారు వాలంటరీ (వీఆర్ఎస్) తీసుకుంటున్నారన్నారు. మంచి అధికారులు కూడా పారిపోయేలా చేసే దండుపాళ్యం ముఠా రాష్ట్రంలో పాలన సాగిస్తుందన్నారు. దండుపాళ్యం ముఠానే రాష్ట్రాన్ని నడిపిస్తుందన్నారు. తాను చెప్పిన పని చేయలేదని చెప్పొ రిజ్వీ గారు ఆయన విఆర్ఎస్ తీసుకుంటే కూడా, ఆయన రాజీనామా ఆమోదించవద్దని జూపల్లి కృష్ణారావు కోరారన్నారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అరాచకాలకు, అక్రమాలకు గనుక భాగస్వాములు అయితే, గతంలో అధికారులు వత్తాసు పలికితే గతంలో మాదిరి జైలుకు వెళ్లవలసి వస్తుందన్నారు. గతంలో మాదిరి అధికారులకు శిక్ష కూడా పడుతుంది కాబట్టి జాగ్రత్తగా ఉండాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. మంత్రుల అవినీతి వాటాల పంచాయతీలకు మీరు దూరం ఉండాలని అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నాము. రాష్ట్రంలో అవినీతి విలయతాండవం చేస్తుందని కేటీఆర్ కాంగ్రెస్ తీరుపై మండిపడ్డారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్ర సచివాలయం దాకా రాష్ట్రంలోని అన్ని శాఖల్లో కొనసాగుతున్నాయి. ముఖ్యమంత్రి వేల కోట్లు సంపాదిస్తుంటే, మేము వందల కోట్లయినా సంపాదించవద్దని మంత్రులు పోటీ పడుతున్నారు. గన్నులు పెట్టి బెదిరించడంతో ఇందిరమ్మ రాజ్యంలో వ్యాపారవేత్తలు తమ వ్యాపారాలు చేసుకోలేకపోతున్నారు. తెలంగాణలో నడుస్తున్నది ఒక మాఫియా రాజ్యం, ఇందిరమ్మ రాజ్యం కాదు. స్వయంగా మంత్రి కూతురు చెప్పింది. రాష్ట్రంలో గనకల్చర్ నడుస్తుందని పారిశ్రామికవేత్త నెత్తిన గన్ను పెట్టి బెదిరించారన్నారు. పోలీసులు వెతుకుతున్న నిందితుడిని అరెస్టు చేయొద్దంటూ మంత్రిగారి కుమార్తె ఆపితే... స్వయంగా మంత్రి తన కారులో తీసుకొని వెళ్ళిపోయినా ఇప్పటిదాకా ఎలాంటి చర్యలు లేవు. రెండు మూడు రోజులపాటు తిట్టుకొని సిగ్గు లేకుండా ముఖ్యమంత్రి , మంత్రి ఇద్దరు కలిసి శాలువాలు కప్పుకుని స్వీట్లు పంచుకున్నారు. ఏం ఉద్ధరించారని ముఖ్యమంత్రికి శాలువా కప్పి పిసిసి ప్రెసిడెంట్ సన్మానం చేశాడు. ఇద్దరు మంత్రులు కలిసి ఏం పొడిచారని పీసీసీ ప్రెసిడెంట్ స్వీట్లు పంచారు. ఇద్దరి మధ్యలో ఏం సెటిల్మెంట్ జరిగిందని ఈ కలరింగ్ ఇచ్చారు. వాటాల పంచాయతీ అవినీతి సొమ్ముల పంపకాలు టెండర్ల రిగ్గింగ్ ఇవన్నీ కూడా కాంగ్రెస్ ఇంటి పంచాయతీ లెక్క మారిపోయాయి. ముఖ్యమంత్రి ఇల్లు సెటిల్మెంట్‌లకు కేంద్రంగా మారిపోయింది. రాష్ట్రంలో మాఫియా రాజ్యమేలుతుంటే, మంత్రులు, ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో ఇంత రాచకం కొనసాగుతుంటే పోలీసులు ఏం చేస్తున్నారు?.. పరిశ్రమల యజమానులకు తుపాకీలు పెట్టినప్పుడు, వాటాల పంచాయతీతోనే మంత్రులు బజారుకెక్కినప్పుడు, సీనియర్ అధికారులు పారిపోతుంటే రాష్ట్రంలోని పోలీసు యంత్రాంగం ఏం చేస్తుందని ఫైర్ అయ్యారు. తుపాకీ ఇచ్చింది రేవంత్ రెడ్డి, తెచ్చింది రోహిన్ రెడ్డి, అక్కడ ఉన్నాడు అని స్వయంగా మంత్రి కుమార్తె చెప్పింది. కానీ పోలీసులు చెప్తుంది: గన్ ఇచ్చింది కొండా మురళి, బెదిరించింది కొండా సురేఖ ఓఎస్డీ సుమంత్ అని చెప్తున్నారు. రెండు అంశాల్లో కూడా బెదిరింపులు గన్నుతో జరిగాయనేది వాస్తవం. కానీ ఇప్పటివరకు పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఈ మొత్తం వ్యవహారంలో రాష్ట్ర డీజీపీ ఎందుకు మౌనంగా ఉన్నారు. నాకు పింకు బుక్కులు లేవు, రెడ్డి బుక్కులు లేవు, కేవలం ఖాకీ బుక్కు మాత్రమే రాష్ట్రంలో ఉంటుందని గొప్పలకు పోయిన రాష్ట్ర డీజీపీ ఏం చేస్తున్నాడు. మా కార్యకర్తలను జైల్లో పెట్టిన పోలీసులు, కాంగ్రెస్ కార్యకర్తలకు ప్రయోజనం చేకూర్చేలా పనిచేస్తున్నారు. రాష్ట్రంలోని కొంతమంది పోలీసులు కాంగ్రెస్ కార్యకర్తల కన్నా దారుణంగా పనిచేస్తున్నారు. నిజంగా డీజీపీకి నిజాయితీగల పేరు ఉంటేనే గనుల బెదిరింపు వ్యవహారంలో చర్యలు తీసుకుని తన చిత్తశుద్ధి నిరూపించుకోవాలి. పోలీస్ యంత్రాంగానికి చిత్తశుద్ధి ఉంటే, గన్ను తెచ్చింది ఎవరు, గన్ను గురిపెట్టింది ఎవరు అనే విషయాన్ని తేల్చాలి. ఈ అంశంలో ఉత్తమ్ కుమార్ రెడ్డిని విచారణ చేసి ఆయన అభిప్రాయాన్ని రికార్డు చేయాలి. సుమంత్‌ను విచారించి నిజానిజాలు బయటపెట్టాలి. ఈ మొత్తం గన్నుతో గురిపెట్టిన సంఘటనలో కచ్చితంగా పోలీసులు చర్యలు తీసుకోవాలి. పోలీస్ శాఖలో 99 శాతం మంది బాగానే ఉన్నారు, నీతిమంతులు ఉన్నారు. కానీ ఒక్క శాతం మంది మాత్రం కాంగ్రెస్ కార్యకర్తల్లా పనిచేస్తున్నారు. వారినే మేము ఈరోజు నిందిస్తున్నాము. మంచిరేవుల భూముల కోసం గన్ను పెట్టి బెదిరిస్తున్నారని మంత్రి కూతురు స్వయంగా చెప్పినప్పుడు ఏం చేస్తున్నారు?.. మంత్రులు ఎక్కడ సంతకం పెట్టారో సొంత కుటుంబ సభ్యులకు కూడా తెలవకూడదు అన్న నియమాలు ఉన్నాయి. ఇవన్నీ మంత్రి బిడ్డకు తెలపడం, జపాన్ లో ఉన్న ముఖ్యమంత్రి ఫైలు వెనక్కి తెప్పించుకోవడం ఇదంతా ఆరాచకంగా మారిందన్నారు. ముఖ్యమంత్రి సోదరుడు 15 ఎకరాలు... కొండా సురేఖ 15 ఎకరాలు తీసుకొని మొత్తం 30 ఎకరాల భూమి పంచాయతీ పెట్టుకున్నారు మంచిరేవులలో. ఈ భూమి మొత్తం నాకు కావాలంటే, నాకు కావాలి అని మంత్రి, రేవంత్ రెడ్డి, కొండా సురేఖ కొట్లాడుతున్నారు. గతంలోనే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పారు, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కుక్కలు చచ్చిన మిస్టరీ చేస్తారు అని. మంత్రులు కాంట్రాక్టులు, కమిషన్ల వ్యవహారాన్ని ఇంటి పంచాయతీగా మార్చారు. పొంగులేటి నా టెండర్లలో తలదూర్చారని మంత్రి కూతురు స్వయంగా చెప్పింది. ఇంత దారుణంగా బహిరంగంగా అవినీతి అంశంపైకి వచ్చిన, బెదిరింపులు బయటపడిన బీజేపీ నేతలు స్పందించడం లేదు. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ - కాంగ్రెస్ జాయింట్ వెంచర్ పరిపాలన నడుస్తున్నది. బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు, అమిత్ షా వంటి వాళ్ళు ఎవరు కూడా మాట్లాడడం లేదు. కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీలు కూడా మౌనంగా ఉన్నాయి. అందుకే తెలంగాణ రాష్ట్రాన్ని బీజేపీ ఏమాత్రం కాపాడలేదు అని మేము చెప్తున్నాము. కాంగ్రెస్ పరిపాలనలో పరిపాలన లేదు, ప్రజా పాలన లేదు. కేవలం అరాచకాలు, అవినీతి, బెదిరింపులు, కమిషన్లు, టెండర్ల రిగ్గింగ్ అన్నీ నడుస్తున్నాయి. వంద రోజులలో అన్నీ చేస్తాం అని చెప్పి మమ్మల్ని మోసం చేసిర్రు అని కాంగ్రెస్‌ను తిడుతున్నారు. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి, అరాచక పాలనను చూసి అసహ్యించుకుంటున్నారు. చాలా అనుభవజ్ఞుడైన ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జున కరిగే నిజాన్ని చెప్పారు. ఇంత అరాచకం అవినీతితో కూడిన పరిపాలన ఆయన చూసి ఉండరు కాబట్టి తెలంగాణలో మళ్ళీ తిరిగి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం కల్ల అనే మాట చెప్పారని కేటీఆర్ అన్నారు. ఆయనకి తెలంగాణ ప్రజల అభిప్రాయాన్ని ఆకాంక్షలను వ్యక్తపరిచినందుకు మా పార్టీ తరఫున ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

## ఏఐజీలో నెలకు 10 లక్షల జీతం

**అందుకే ఐఏఎస్ రిజ్వి వీఆర్ఎస్**

**మంత్రి జూపల్లి సంచలన వ్యాఖ్యలు**



హైదరాబాద్, అక్టోబర్ 23 (ఈవార్తలు): ఐఏఎస్ రిజ్వి వీఆర్ఎస్ కాంట్రవర్సీ పై మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందించారు. గురువారం సచివాలయంలో కేబినెట్ భేటీ అనంతరం ఆయన మీడయాతో సమావేశంలో మాట్లాడారు. 'ఐఏఎస్ అధికారి సామ్ రిజ్వీ వీఆర్ఎస్ తీసుకున్నారు, ఎందుకంటే ఆయనకు ఏఐజీ ఆసుపత్రిలో నెలకు రూ.10 లక్షల జీతంతో ఉద్యోగం దొరికింది' అని ఆయన మంత్రి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆ విషయం తనకు తెలియదన్నారు. ఈ విషయానికి కేటీఆర్ ముడి పెట్టే ప్రయత్నం చేశారని అన్నారు. టెండర్లు పిలవకముందే రూ.500 కోట్ల ముడుపులు అని సీఎం అల్లుడు లేదా నా కుమారుడి పేర్లు లాగడం ఏంటి అర్థం..? అని ప్రశ్నించారు. కల్వకుంట్ల కుటుంబం అంటేనే లిక్కర్‌కు బ్రాండ్ అంబాసడర్' అని విమర్శించారు.


## నిజాం ఆస్తులపై విచారణ

**ఏడో నిజాం ఆస్తుల పంపకాల వివాదంలో కీలక పరిణామం**

**ముఖరం జా వారసుల మధ్యంతర పిటిషన్‌ను కొట్టివేసిన కోర్టు**

**రూ.10,000 కోట్లకు పైగా విలువైన 5 రాజమహళ్లపై దావా**

**నజఫ్ అలీ ఖాన్ వేసిన పంపకాల దావా పూర్తి విచారణకు మార్గం సుగమం**



హైదరాబాద్, అక్టోబర్ 23 (ఈవార్తలు): ఏడో నిజాం నవాబ్ మీర్ ఉస్మాన్ అలీ ఖాన్‌కు చెందిన వేల కోట్ల రూపాయల విలువైన రాజమహళ్ల పంపకాల వివాదంలో ఆయన వారసులకు కోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఈ ఆస్తుల పంపకాలపై దాఖలైన దావాను కొట్టివేయాలని కోరుతూ ఎనిమిదో నిజాంగా గుర్తింపు పొందిన ముఖరం జా కుమారుడు అజ్మత్ జా, కుమార్తె షెకర్ జా దాఖలు చేసిన మధ్యంతర పిటిషన్‌ను హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు గురువారం తోసిపుచ్చింది. దీంతో అసలు కేసులో పూర్తిస్థాయి విచారణకు మార్గం సుగమమైంది. ఏడో నిజాం మనవళ్లలో ఒకరైన నవాబ్ నజఫ్ అలీ ఖాన్, తన తాత ఆస్తులను వారసులందరికీ పంచాలని కోరుతూ 2021లో ఈ దావా వేశారు. ఫలక్‌నుమా ప్యాలెస్, చౌమహల్లా ప్యాలెస్, పురానీ హవేలీ, కింగ్ కోఠి ప్యాలెస్‌తో పాటు ఊటీలోని హేర్‌వుడ్ అండ్ సెడార్స్ బంగ్లా వంటి ఐదు చారిత్రక ఆస్తుల పంపకం జరగాలని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ ఆస్తుల ప్రస్తుత విలువ రూ.10,000 కోట్లకు పైగా ఉంటుందని అంచనా. ఈ కేసును విచారణకు స్వీకరించవద్దని అజ్మత్ జా, షెకర్ జా కోర్టును ఆశ్రయించారు. అయితే నజఫ్ అలీ ఖాన్ తరఫు న్యాయవాది తమ వాదనలు వినిపిస్తూ, ఏడో నిజాం చట్టబద్ధమైన వారసుడిగా పిటిషనర్‌కు పూర్వీకుల ఆస్తులపై హక్కు ఉందని తెలిపారు. ఆస్తుల యాజమాన్యం, వాస్తవాధీనం, విలువ వంటి అంశాలను పూర్తిస్థాయి విచారణ ద్వారానే తేల్చగలమని వాదించారు. ఈ వాదనలతో ఏకీభవించిన న్యాయస్థానం, మధ్యంతర పిటిషన్‌ను కొట్టివేసి, అసలు దావా విచారణకు అనుమతించింది. 1967 ఫిబ్రవరి 24న ఏడో నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ మరణించిన తర్వాత, భారత ప్రభుత్వం ఆయన మనవడు ముఖరం జాను వారసుడిగా గుర్తించింది. అయితే, నిజాం ప్రైవేట్ ఆస్తులను ఇస్లామిక్ షరియత్ చట్టం ప్రకారం ఆయన 34 మంది సంతానానికి సమానంగా పంచాలని, కేవలం ఒకే వ్యక్తి ఆస్తులను అనుభవించడం సరికాదని నజఫ్ అలీ ఖాన్ వాదిస్తున్నారు. ఈ కేసులో మొత్తం 232 మంది ప్రతివాదులుగా ఉండగా, వారిలో ఫలక్‌నుమా ప్యాలెస్‌ను నిర్వహిస్తున్న ఇండియన్ హోటల్స్ కంపెనీ కూడా ఉంది.

## ప్రజలు కోరుకుంటే పార్టీ

**పార్టీ ఏర్పాటుపై కవిత కీలక వ్యాఖ్యలు**



హైదరాబాద్, అక్టోబర్ 23 (ఈవార్తలు): బీఆర్ఎస్ నుంచి బహిష్కరణకు గురైన ఎమ్మెల్సీ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత రాజకీయ పార్టీ ఏర్పాటు పై కీలక వ్యాఖ్యలు చేశారు. బహిష్కరణ తర్వాత దూకుడుగా వ్యవహరిస్తున్న కవిత ఈ నెల 25 నుంచి జనంబాట పేరుతో ప్రజల్లోకి వెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో భాగంగా ఈరోజు యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కవితకు ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం కవిత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యాలు చేశారు. మీడియా అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ ప్రజలు కోరుకుంటే తప్పకుండా తాను రాజకీయ పార్టీ పెడతానని స్పష్టం చేశారు. అయితే పార్టీ పెడితే తనకు కాదని.. ప్రజలకు మేలు జరగాలని కవిత ఈ సందర్భంగా పేర్కొనడం గమనార్హం. ఇంకా మాట్లాడుతూ తెలంగాణ జాగృతి సామాజిక సంస్థ అయినప్పటికీ అవసరమైతే రాజకీయాల గురించి తాను పుష్కలంగా మాట్లాడతానని స్పష్టం చేశారు. రాజకీయాల గురించి మాట్లాడాలంటే రాజకీయ తెలంగాణ జాగృతి రాజకీయ పార్టీగానే ఉండాల్సిన అవసరం లేదని తెలిపారు. ఒక వేళ తనను తనుంచి పార్టీ రావాలని ప్రజలు కోరుకుంటే తప్పకుండా వస్తానన్నారు. అందులో ఎలాంటి ఇబ్బంది లేదని పేర్కొన్నారు. ఆంధ్రలో మూడు, తమిళనాడులో రెండు ప్రాంతీయ పార్టీలు ఉన్నాయని, కేరళలో అయితే గల్లీకి ఒక పార్టీ ఉందని గుర్తుచేశారు. అలాంటిది తెలంగాణలోనూ ఉండటంలో తప్పేం లేదని. అయితే పార్టీలు ఉండటం పెద్ద విషయం కాదని... ఆయా పార్టీలతో ప్రజలకు మేలు జరగాలని కవిత ఆకాంక్షించారు. కాగా తెలంగాణ జాగృతి చేపడతున్న కార్యక్రమాలపై ప్రజాభిప్రాయం తెలుసుకునేందుకే "జనం బాట' కార్యక్రమం నిర్వహిస్తున్నానని కవిత తెలిపారు. ఎల్లుండి నుంచి 4నెలల పాటు 'జనం బాట' కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో అన్ని వర్గాలను కలుస్తానని, వారి సమస్యలు తెలుసుకుంటానని వివరించారు. ఈ నెల 25న నిజామాబాద్ నుంచి ప్రారంభమయ్యే 'జనం బాట' కార్యక్రమం 33జిల్లాల్లో 4నెలలు పాటు జరుగుతుందని కవిత తెలిపారు. ప్రతి జిల్లాలో రెండు రోజుల పాటు ఉంటానని.. అక్కడి సమస్యలు తెలుసుకుంటానని తెలిపారు. ఈ సందర్భంగా మేధావులు, విద్యావంతులు, రైతులు, యువత, మహిళలు ఇలా అన్ని వర్గాలను కలుస్తానని వెల్లడించారు.

## త్వరలో తెలంగాణలో లైఫ్ సైన్సెస్ స్కూల్

**మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి**



మెల్‌బోర్న్: అంతర్జాతీయ భాగస్వామ్యాల ద్వారా తెలంగాణ రాష్ట్రాన్ని 'గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్'గా తీర్చిదిద్దాలనేదే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న మంత్రి బుధవారం మెల్‌బోర్న్‌లో కీలక సమావేశాలు నిర్వహించి, రాష్ట్రంలో పెట్టుబడులు, ఉన్నత విద్య, పరిశోధనల కోసం మార్గం సుగమం చేశారు. మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో మెల్‌బోర్న్‌లోని ప్రముఖ విశ్వవిద్యాలయం 'ఆర్ఎంఐటీ'తో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం లెటర్ ఆఫ్ ఇంటెంట్‌పై సంతకాలు చేసింది. తెలంగాణ లైఫ్ సైన్సెస్ సీఈవో శక్తి నాగప్పన్, ఆర్ఎంఐటీ డిప్యూటీ వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ కేథరీన్ ఇట్సియోపౌలోస్ ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. ఈ ఒప్పందం లైఫ్ సైన్సెస్ రంగంలో ఇన్నోవేషన్, పరిశోధన, అభివృద్ధి, ఉన్నత విద్య, రెడీ టు వర్క్ ఫోర్స్ తయారీకి దోహదపడుతుందని పేర్కొన్నారు. ఆసియాలోనే అగ్రగామిగా ఎదుగుతున్న తెలంగాణ లైఫ్ సైన్సెస్ ఆర్థిక వ్యవస్థను 2030 నాటికి 250 బిలియన్ డాలర్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ ఒప్పందం భవిష్యత్తు జీనోమ్ వ్యాలీకి బ్లూ ప్రింట్‌గా ఉపయోగపడుతుందన్నారు. యువతను లైఫ్ సైన్సెస్ నిపుణులుగా తీర్చిదిద్దేందుకు త్వరలోనే తెలంగాణ లైఫ్ సైన్సెస్ స్కూల్‌ను ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. తాజా ఒప్పందంలో భాగంగా ఉమ్మడి పీహెచ్‌డీ కార్యక్రమాలు, స్టూడెంట్-ఫ్యాకల్టీ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్ అందుబాటులోకి వస్తాయన్నారు. పరిశోధక విద్యార్థులు బిట్స్ హైదరాబాద్, ఆర్ఎంఐటీ యూనివర్సిటీల నిపుణుల మార్గనిర్దేశంలో పరిశోధన చేసే అవకాశం లభిస్తుందని చెప్పారు. ఆస్ట్రేలియా ప్రధాన కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న మైనింగ్ రంగ దిగ్గజ సంస్థ 'ఒరికా' ప్రతినిధులను మంత్రి శ్రీధర్‌బాబు తెలంగాణలో మరిన్ని పెట్టుబడులు పెట్టాలని కోరారు. ఇండస్ట్రియల్ పేలుడు పదార్థాలు, మైనింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగాల్లో ప్రపంచ అగ్రగామిగా ఉన్న ఒరికా సీఈవో, ఎండీ సంజీవ్ గాంధీతో మంత్రి భేటీ అయ్యారు. ఇండస్ట్రియల్ ఇన్నోవేషన్, సుస్థిరత , తయారీ, మైనింగ్ రంగాల్లో డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ కోసం తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పనిచేయాలని మంత్రి ఆహ్వానించారు. దీనికి ఒరికా సీఈవో సానుకూలంగా స్పందించారు. మరోవైపు, ఆస్ట్రేలియాకు చెందిన ప్రముఖ విద్యా సంస్థ విక్టోరియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీఐటీ) తెలంగాణలో 'ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ సిటీ'ని 'ప్లగ్ అండ్ ప్లే' విధానంలో ఏర్పాటు చేయడానికి ఆసక్తి కనబరచడం విశేషం. ఈ చర్చలు, ఒప్పందాల ద్వారా తెలంగాణలో పెట్టుబడులు, విద్యారంగంలో నూతన శకం మొదలవనుందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

## హైదరాబాద్‌లో సెక్స్ రాకెట్

**బంజారాహిల్స్ హోటల్‌లో వ్యభిచారం**

**ప్రధాన నిర్వాహకుడితో పాటు ఏడుగురు విటులు, రిసెప్షనిస్ట్ అరెస్ట్**

బంజారాహిల్స్/హైదరాబాద్, అక్టోబర్ 23 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో గుట్టుగా సాగుతున్న ఓ భారీ వ్యభిచార ముఠా గుట్టును పోలీసులు ఛేదించారు. నగరంలోని ఓ ప్రముఖ హోటల్‌ను కేంద్రంగా చేసుకుని సాగుతున్న ఈ దందాపై కమిషనర్ టాస్క్‌ఫోర్స్, బంజారాహిల్స్ పోలీసులు సంయుక్తంగా దాడి చేసి నిర్వాహకులతో పాటు విటులను అదుపులోకి తీసుకున్నారు. ఈ ముఠా చెర నుంచి ఉజ్బెకిస్థాన్ యువతితో సహా ముగ్గురు మహిళలను రక్షించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని ఆర్-ఇన్ హోటల్‌లో వ్యభిచారం జరుగుతున్నట్లు పక్కా సమాచారం అందింది. దీంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు, స్థానిక పోలీసులతో కలిసి హోటల్‌లోని 111, 112 నంబర్ గదులపై ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఈ దాడిలో ప్రధాన నిర్వాహకుడైన ఎండీ షరీఫ్‌ను అరెస్ట్ చేశారు. అతనితో పాటు ఏడుగురు విటులను, హోటల్ రిసెప్షనిస్ట్‌ను కూడా అదుపులోకి తీసుకున్నారు. విటులంతా కర్నూలుకు చెందినవారిగా పోలీసులు గుర్తించారు. 'స్టైల్ మేకర్ సెలూన్' యజమాని అయిన ఎండీ షరీఫ్, ఆర్థికంగా వెనుకబడిన, ఉద్యోగాలు లేని యువతులను లక్ష్యంగా చేసుకుని ఈ దందాను నడుపుతున్నట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. వారికి పెద్ద మొత్తంలో జీతాలు, కమీషన్లు ఇస్తామని ఆశ చూపి వ్యభిచార కూపంలోకి దింపుతున్నాడని పోలీసులు వెల్లడించారు. నిందితుల నుంచి రూ. 5,950 నగదు, 13 మొబైల్ ఫోన్లు, 12 వాడని కండోమ్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ చేసిన నిందితులను, స్వాధీనం చేసుకున్న సొత్తును తదుపరి విచారణ నిమిత్తం బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## 908 కేజీల గంజాయి పట్టివేత



బండ్లగూడ/హైదరాబాద్, అక్టోబర్ 23 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని బండ్లగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో భారీగా గంజాయి పట్టుబడింది. గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురు వ్యక్తులను సౌత్ ఈస్ట్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.2.70 కోట్ల విలువైన 908 కిలోల డ్రై గంజాయిని స్వాధీనం చేశారు. ఈ వ్యవహారంపై సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ చైతన్య కుమార్ మీడియాతో మాట్లాడుతూ వివరాలను వెల్లడించారు. గంజాయి సరఫరా చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను అరెస్టు చేశామన్నారు. బండ్లగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో మహారాష్ట్రకు గంజాయి తరలిస్తున్న నిందితుల్ని అరెస్టు చేశామని.. సుమారు 908 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. బహిరంగ మార్కెట్లో దీని ధర రూ.2.70 కోట్లు ఉంటుందని తెలిపారు. ఒడిశాలోని మల్కన్‌గిరి ప్రాంతం నుంచి హైదరాబాద్ మీదుగా మహారాష్ట్ర నాసిక్ వైపు రవాణా చేస్తున్నట్లు గుర్తించామన్నారు. ఈ కేసులో ఏ-1 మొహమ్మద్ కలీం ఉద్దీన్ డ్రైవర్/గంజాయి ట్రాన్స్‌పోర్టర్, ఏ-2 షేక్ సోహైల్, ఏ-3 మొహమ్మద్ అఫ్జల్ (అబ్బు)ను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన రెహమాన్, ఒడిశాకు చెందిన జిథు , శ్రీకాకుళానికి చెందిన సురేష్, మహారాష్ట్రకు చెందిన మహేష్ ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు చెప్పారు. పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు కొనసాగుతోందన్నారు. మహారాష్ట్రకు చెందిన మహేష్ గంజాయిని కొనుగోలు చేస్తున్నాడని తెలిపారు. ఒడిశా రాష్ట్రంలోని మల్కన్‌గిరిలో మారుమూల అటవీ ప్రాంతంలో సురేష్ , జిథు గంజాయిని కొనుగోలు చేసి మహారాష్ట్రలో వివిధ ప్రాంతాలకు సరఫరా చేయడానికి ప్లాన్ చేశారని.. గంజాయి సరఫరాలో రెహమాన్ ప్రధాన రవాణాదారుడిగా వ్యవహరిస్తున్నాడని చెప్పారు. రిసీవర్ మహేష్ ఒడిశాలోని జిథు, సురేష్ వద్ద గంజాయి సేకరించారన్నారు. వారి నుంచి ఐషర్ డీసీఎం ట్రాన్స్‌పోర్ట్ వాహనం, నాలుగు మొబైల్ ఫోన్లను సీజ్ చేశామని చెప్పారు.

## కేటీఆర్ పెడబొబ్బలు

**ఎన్ని పెడబొబ్బలు పెట్టినా ఏం ఉపయోగం లేదు**

**వాగినంత మాత్రాన నువ్వు పెద్ద మొగోడివి కావు**

**ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**



హైదరాబాద్, అక్టోబర్ 23 (ఈవార్తలు): సిరిసిల్ల ఎమ్మెల్యే, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. హైదరాబాదులో మీడియాతో మాట్లాడిన ఆది శ్రీనివాస్ 'కేటీఆర్.. నువ్వెన్ని పెడబొబ్బలు పెట్టినా ఏం ఉపయోగం లేదు. మా ముఖ్యమంత్రి పైన పిచ్చి పిచ్చిగా వాగినంత మాత్రాన నువ్వు పెద్ద మొగోడివి కావు' అని ఎద్దేవా చేశారు. అధికారంలో ఉన్నంత కాలం కేటీఆర్, కేసీఆర్ ఇద్దరు కలిసి తెలంగాణను దోచుకున్నారని ఆరోపించారు. 'మీ బతుకు, నీ అయ్య బతుకు ఏమిటో తెలంగాణ ప్రజలు తేల్చేశారు. అధికారంలో ఉన్న రోజుల్లో సువర్ణపురం దొంగల్లా పాలన చేశారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ ప్రగతిభవన్ గడీ కట్టుకున్నారు. మీ పాలనలో మంత్రులు, ఎమ్మెల్యేలు కరివేపాకులా వాడి పారేశారు. మా ముఖ్యమంత్రి అందరినీ గౌరవంగా చూస్తారు. మీలా గేటు దగ్గర అవమానించి పంపించడం లేదు. వేదికలపై మంత్రులను ఈసడించుకోలేదు, ఈకముక్కలా తీసిపారేయలేదు. దళిత డిప్యూటీ సీఎంను కారణం చెప్పకుండా బర్తరఫ్ చేసిన చరిత్ర కూడా కేసీఆర్‌దే' అని ఆది శ్రీనివాస్ మండిపడ్డారు. 'అవినీతి సొమ్ములో వాటా అడిగిన సొంత బిడ్డను పార్టీ నుంచి గెంటివేసింది మీ చరిత్ర. పదేళ్ల అధికారంలో నిజాయితీగల ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను పక్కన పెట్టి రిటైర్డ్ అధికారులతో రాజ్యం నడిపారు. తెలంగాణ పోలీసులు ఏం పీకుతున్నారంటూ వాగుతున్నారు. వెయిట్ చేయి.. అన్ని చూస్తున్నాం. సొంత ఇళ్లు చక్కబెట్టుకోలేని నువ్వు మా ముఖ్యమంత్రి గురించి మాట్లాడుతావా?. నీ చెల్లెలు అడిగిన ఒక్క ప్రశ్నకైనా ఇప్పటివరకు సమాధానం చెప్పావా?. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల నేపథ్యంలో కేటీఆర్ చేస్తున్న రాజకీయ ప్రదర్శనలను ఆపు. నువ్వెంత ఎగిరిపెడ్డా ఉపయోగం లేదు.. నీ మూతి పళ్లే రాలుతాయి చూసుకో' అంటూ కేటీఆర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు.

## రిజ్వీ వీఆర్ఎస్ ఎందుకు?

**ప్రభుత్వం సమాధానం చెప్పాలి: ఎంపీ లక్ష్మణ్**

హైదరాబాద్, అక్టోబర్ 23 (ఈవార్తలు): సీనియర్ ఐఏఎస్ అధికారి సయ్యద్ అలీ ముర్తుజా రిజ్వీ వీఆర్ఎస్ తీసుకోవడం రాష్ట్ర ప్రభుత్వ వ్యవహార శైలిపై అనుమానాలకు తావిస్తోందని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కే లక్ష్మణ్ అన్నారు. రిజ్వీ ఎందుకు వీఆర్ఎస్ తీసుకోవాల్సి వచ్చిందో రాష్ట్ర ప్రభుత్వం జవాబు చెప్పాలని డాక్టర్ లక్ష్మణ్ ప్రశ్నించారు. 'మంత్రులు ఒత్తిడికి లొంగకపోతే వాళ్లని బలి చేస్తారా..?' అని ఆయన దుయ్యబట్టారు. 'మీ స్వార్థం కోసం అధికారులని వేధిస్తారా..?' అని లక్ష్మణ్ ఘాటుగా విమర్శించారు. ఇంకా విచారణ పేరుతో సీనియర్ ఐఏఎస్ అధికారిని వేధించడం తగదని ఆయన హితవు పలికారు. ఒకవేళ తప్పుచేసి ఉంటే ఇన్నిరోజులు ఎందుకు మాట్లాడలేదని రాష్ట్ర ప్రభుత్వాన్ని, మంత్రులను ఆయన నిలదీశారు.

# అమరావతికి రెండో విడత నిధులు

## ప్రపంచ బ్యాంకు గ్రీన్ సిగ్నల్.. ఈ ఏడాది చివరి నాటికి 200 మిలియన్ డాలర్లు

అమరావతి, అక్టోబర్ 23 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణ పనులకు ప్రపంచ బ్యాంకు నుంచి మరో విడత భారీ నిధులు అందనున్నాయి. మొదటి దశ అభివృద్ధి కోసం హామీ ఇచ్చిన రుణంలో భాగంగా ఈ ఏడాది చివరి నాటికి రెండో విడతగా సుమారు 200 మిలియన్ డాలర్లను (దాదాపు రూ. 1700 కోట్లు) విడుదల చేసే అవకాశం ఉందని రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారి ఒకరు గురువారం వెల్లడించారు. ఈ నిధుల విడుదలతో రాజధానిలో నిర్మాణ పనులు మరింత వేగవంతం కానున్నాయి. అమరావతి మొదటి దశ నిర్మాణానికి ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ) చెరో 800 మిలియన్ డాలర్ల చొప్పున మొత్తం 1600 మిలియన్ డాలర్లు (రూ. 13,600 కోట్లు) ఆర్థిక సాయం అందించేందుకు అంగీకరించాయి. ఇందులో భాగంగా ప్రపంచ బ్యాంకు ఇప్పటికే ఈ ఏడాది మార్చిలో తొలి విడతగా 207 మిలియన్ డాలర్లను విడుదల చేసింది. ఈ నిధులలో దాదాపు 50 శాతం మేర వివిధ పనులకు ఖర్చు చేసినట్లు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్. సురేశ్ కుమార్ తెలిపారు. "ప్రపంచ బ్యాంకు నుంచి మాకు దాదాపు రూ. 1800 కోట్లు అందాయి. అందులో సగానికిపైగా ఖర్చు చేశాం. నిబంధనల ప్రకారం తొలి విడత నిధుల్లో 75 శాతం ఖర్చు పూర్తి కాగానే, రెండో విడత కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. డిసెంబర్ నాటికి ఆ లక్ష్యాన్ని చేరుకుని, తదుపరి విడత నిధులను పొందుతామని ఆశిస్తున్నాం" అని ఆయన పీటీఐకి వివరించారు. కేంద్ర ప్రభుత్వం కూడా తన వాటాగా రూ. 1400 కోట్లను అందించనుంది. రాజధానిలో జరుగుతున్న పనుల పురోగతిని ప్రపంచ బ్యాంకు, ఏడీబీ బృందాలు ప్రతి నెలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నాయని సురేశ్ కుమార్ పేర్కొన్నారు. సీఆర్డీఏ అధికారులతో సమావేశమై, రికార్డులను పరిశీలించి, పనుల నాణ్యతను తనిఖీ చేస్తున్నాయని తెలిపారు.



పనుల అమలు తీరుపై ప్రపంచ బ్యాంకు ఇటీవల విడుదల చేసిన నివేదికలో పూర్తి సంతృప్తి వ్యక్తం చేసిందని ఆయన గుర్తు చేశారు. నిర్మాణ కార్యకలాపాలు ప్రారంభం కావడం, పర్యావరణ-సామాజిక నిర్వహణ విభాగాన్ని ఏర్పాటు చేయడం వంటి అంశాలను ప్రపంచ బ్యాంకు ప్రశంసించినట్లు నివేదికలో పేర్కొంది. ఈ ప్రాజెక్టుకు కేంద్ర ఆర్థిక వ్యవహారాల శాఖ రుణగ్రహీతగా వ్యవహరిస్తుండగా, ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్డీఏ) అమలు ఏజెన్సీగా బాధ్యతలు నిర్వర్తిస్తోంది.



## ఏపీలో ఆరోగ్యశ్రీ సేవలకు బ్రేక్

**రూ. 2,700 కోట్ల బకాయిలే కారణమన్న షర్మిల**

**15 రోజులుగా రోగుల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండిపాటు**

విజయవాడ, అక్టోబర్ 23 (ఈవార్తలు) : ఆంధ్రప్రదేశ్‌లో ఆరోగ్యశ్రీ పథకం కింద సేవలు నిలిచిపోవడంపై కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రైవేటు ఆసుపత్రులకు ప్రభుత్వం రూ. 2,700 కోట్ల బకాయిలు పెట్టడం వల్లే ఈ దుస్థితి తలెత్తిందని ఆమె ఆరోపించారు. ఆరోగ్యశ్రీ చరిత్రలోనే ఇది ఒక చీకటి రోజు అని గురువారం 'ఎక్స్' వేదికగా ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. గత 15 రోజులుగా ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోవడంతో లక్షలాది మంది రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని షర్మిల పేర్కొన్నారు. అత్యవసర సర్జరీలు సైతం ఆగిపోయి పేదలు నరకయాతన అనుభవిస్తున్నా, కూటమి ప్రభుత్వానికి మనసు కరగడం లేదని విమర్శించారు. చేసిన వైద్యానికి బిల్లులు చెల్లించాలంటూ ఆసుపత్రులు రోడ్డెక్కడం అత్యంత విచారకరమని అన్నారు. రాష్ట్రంలో ఇంత పెద్ద సంక్షోభం నెలకొన్నా ముఖ్యమంత్రి చంద్రబాబు మౌనంగా ఉండటం ఆయన మూర□త్వానికి నిదర్శనమని షర్మిల దుయ్యబట్టారు. వైద్యం అందక ప్రజలు అల్లాడుతుంటే ప్రభుత్వం చోద్యం చూడటం దారుణమని మండిపడ్డారు. ఇది కేవలం నిర్లక్ష్యం కాదని, పేదలకు అండగా నిలిచిన ఆరోగ్యశ్రీ పథకాన్ని నిర్వీర్యం చేసి, పూర్తిగా చంపేసే కుట్రలో భాగమేనని ఆమె ఆరోపించారు.

# అర్హులందరికీ కొత్త అక్రిడిటేషన్‌లు

**ఏపీ సమాచార శాఖ కమిషనర్ విశ్వనాథన్**

విజయవాడ, అక్టోబర్ 23 (ఈవార్తలు): ఏపీలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులందరికీ త్వరలోనే కొత్త అక్రిడిటేషన్లు జారీ చేస్తామని ఆంధ్రప్రదేశ్ సమాచార శాఖ సంచాలకుడు కె.ఎస్. విశ్వనాథన్ హామీ ఇచ్చారు. మరోసారి పాత అక్రిడిటేషన్లు పునరుద్ధరించకుండా, కొత్త అక్రిడేషన్ల ప్రక్రియను ప్రారంభిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఏపీయూడబ్ల్యూజే ప్రతినిధుల బృందం నిన్న సంచాలకుడు విశ్వనాథన్‌ను కలిసి జర్నలిస్టుల సమస్యలు, అక్రిడిటేషన్ల అంశాలపై సుదీర్ఘంగా చర్చించింది. ఈ సమావేశంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐ.వి. సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి కంచల జయరాజ్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు ఏచూరి శివ, ఉపాధ్యక్షుడు చావా రవి తదితరులు పాల్గొన్నారు. ప్రతినిధులు సమర్పించిన వినతిపత్రంలో పలు ముఖ్యమైన డిమాండ్లను ప్రస్తావించారు. రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో అక్రిడిటేషన్ కమిటీలను ఏర్పాటు చేయాలని, జర్నలిస్టుల దాడుల నివారణ కమిటీ, ప్రొఫెషనల్ ఎథిక్స్ కమిటీ, వెల్ఫేర్ ఫండ్ కమిటీ వంటి సంస్థలను తిరిగి ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా జర్నలిస్టుల సంక్షేమానికి ఏర్పాటు చేసిన వర్కింగ్ జర్నలిస్టుల వెల్ఫేర్ ఫండ్‌ను పునరుద్ధరించి, ప్రభుత్వ ప్రకటన బిల్లుల నుండి 5 శాతం మొత్తాన్ని ఆ నిధికి మళ్లించాలని విజ్ఞప్తి చేశారు. హెల్త్ కార్డుల పథకాన్ని బలోపేతం చేయాలని, సమాచార శాఖ – ఆరోగ్యశ్రీ ట్రస్ట్ %-% జర్నలిస్టు సంఘాల ప్రతినిధులతో త్రైపాక్షిక కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. 2016లో ప్రారంభమైన వర్కింగ్ జర్నలిస్టుల ప్రమాద బీమా పథకాన్ని తిరిగి ప్రారంభించాలని, వేజ్ బోర్డు సిఫారసులను అమలు చేయాలని కూడా కోరారు. విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులపై దాడులను అరికట్టేందుకు మహారాష్ట్ర తరహాలో ప్రత్యేక చట్టం తేవాలని డిమాండ్ చేశారు. కరోనా కాలంలో రద్దైన రైల్వే రాయితీ ప్రయాణ సదుపాయాన్ని పునరుద్ధరించాలని, చిన్న, మధ్య తరహా పత్రికలకు రొటేషన్ పద్ధతిలో ప్రభుత్వ ప్రకటనలు ఇవ్వాలని సూచించారు. అలాగే, వయోభారంతో వృత్తి నుండి విరమించిన పాత్రికేయులకు పింఛన్ సదుపాయం, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు, సీనియర్ జర్నలిస్టులకు జీవన సాఫల్య పురస్కారం పునరుద్ధరణను కోరారు. ఈ సూచనలన్నింటిపై సానుకూలంగా స్పందించిన కమిషనర్ విశ్వనాథన్ "జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తక్షణమే సమావేశాలు ఏర్పాటు చేసి, అవసరమైన నిర్ణయాలు తీసుకుంటాం" అని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సెక్రటరీ దాసరి నాగరాజు, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాంబాబు, స్టేట్ కౌన్సిల్ సభ్యులు ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్పీడీసీఎల్‌లో అవినీతి వల్లే కరెంట్ చార్జీల మోత

**మాజీ ఐపీఎస్ అధికారి ఏబీ సంచలన ఆరోపణలు**



తిరుపతి, అక్టోబర్ 23 (ఈవార్తలు): గత ప్రభుత్వ హయాంలో దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎస్పీడీసీఎల్)లో జరిగిన భారీ అవినీతి కారణంగానే వినియోగదారులపై విద్యుత్ చార్జీల భారం పడుతోందని మాజీ ఇంటెలిజెన్స్ డీజీ ఏబీ వెంకటేశ్వరరావు సంచలన ఆరోపణలు చేశారు. ఈ అవినీతిపై సమగ్ర విచారణ జరపాలని కోరుతూ ఆయన గురువారం తిరుపతిలో ఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... "కర్మను తప్పించుకోగలమేమో గానీ, కరెంటు బిల్లును మాత్రం తప్పించుకోలేం. మన పిల్లలైనా ఆ బిల్లులు కట్టాల్సిందే" అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరో చేసిన అవినీతికి సామాన్య వినియోగదారుడు ఎందుకు భారం మోయాలని ఆయన ప్రశ్నించారు. రూపాయి విలువ చేసే వస్తువును మూడు రూపాయలకు కొనుగోలు చేసి, ఆ భారాన్ని ప్రజలపై మోపడం అన్యాయమని అన్నారు. గత ప్రభుత్వంలో నియమితులైన సంతోష్ రావు హయాంలోనే ఈ అవినీతికి బీజం పడిందని వెంకటేశ్వరరావు ఆరోపించారు. ఆయనపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) ద్వారా వివరాలు కోరినా అధికారులు ఇవ్వలేదని తెలిపారు. 12 సార్లు అప్పీలు చేసినా సమాచారం ఇవ్వకుండా దాచిపెట్టారని, 2023 నుంచి ఎస్పీడీసీఎల్‌లో అవినీతి వ్యవస్థీకృతంగా మారిందని ఆయన విమర్శించారు. అధికారులు, కంపెనీలు కుమ్మక్కై అవినీతి సొమ్మును పంచుకున్నారని ఆరోపించారు. ఈ అవినీతిని అరికడితేనే విద్యుత్ చార్జీలు తగ్గుతాయని ఆయన స్పష్టం చేశారు. ఈ అంశంపై ప్రజల్లో విస్తృత చర్చ జరగాలనే ఉద్దేశంతోనే దీనిని బయటపెడుతున్నట్లు చెప్పారు. పూర్తి ఆధారాలతో శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో అన్ని రాజకీయ పార్టీలతో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు వెంకటేశ్వరరావు ప్రకటించారు.

# నవంబర్ 1 నుంచి కొత్త నామినేషన్ రూల్స్

**అమల్లోకి కొత్త బ్యాంకింగ్ నామినేషన్ నిబంధనలు**

**నలుగురు నామినీలను నియమించుకునే అవకాశం**

న్యూఢిల్లీ: బ్యాంకు ఖాతాదారులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. డిపాజిట్ ఖాతాలు, సేఫ్టీ లాకర్లకు సంబంధించిన నామినేషన్ సౌకర్యాలలో కీలక మార్పులు తీసుకువచ్చింది. కొత్త నిబంధనల ప్రకారం, ఖాతాదారులు ఇకపై ఒకరికి బదులుగా గరిష్ఠంగా నలుగురిని నామినీలుగా నియమించుకోవచ్చు. ఈ కొత్త విధానం నవంబర్ 1 నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి వస్తుందని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ గురువారం ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. బ్యాంకింగ్ చట్టాల (సవరణ) చట్టం 2025లో భాగంగా ఈ కొత్త నిబంధనలను ప్రవేశపెట్టారు. దీని ప్రకారం బ్యాంకు డిపాజిట్లకు నామినీలను రెండు విధాలుగా నియమించుకునే అవకాశం కల్పించారు. ఖాతాదారులు తమకు నచ్చిన విధంగా నలుగురు నామినీలకు ఒకేసారి లేదా ఒకరి తర్వాత మరొకరికి ప్రయోజనం అందేలా ఎంచుకోవచ్చు. అయితే, బ్యాంకుల్లోని సేఫ్ కస్టడీ వస్తువులకు, సేఫ్టీ లాకర్లకు మాత్రం ఒకరి తర్వాత మరొకరు అనే పద్ధతిలోనే నామినేషన్ చేసుకునేందుకు అనుమతి ఉంటుంది. ఈ కొత్త విధానంలో మరో ముఖ్యమైన సౌలభ్యం కూడా ఉంది. నలుగురు నామినీలను ఎంచుకున్నప్పుడు, ఎవరికి ఎంత వాటా (శాతం) చెందాలో కూడా ఖాతాదారులే ముందుగా నిర్దేశించవచ్చు. అయితే, మొత్తం వాటాలన్నీ కలిపి 100 శాతానికి సమానంగా ఉండాలి. ఈ నిర్ణయం వల్ల భవిష్యత్తులో క్లెయిమ్ సెటిల్‌మెంట్లు చాలా సులభంగా, పారదర్శకంగా పూర్తవుతాయని ప్రభుత్వం భావిస్తోంది. డిపాజిటర్ల ప్రయోజనాలను కాపాడటం, కస్టమర్లకు సౌకర్యాన్ని పెంచడమే లక్ష్యంగా ఈ మార్పులు చేసినట్లు ఆర్థిక శాఖ తెలిపింది. బ్యాంకింగ్ చట్టాల సవరణ చట్టంలోని సెక్షన్లు 10, 11, 12, 13.. నవంబర్ 1 నుంచి అమల్లోకి వస్తాయని కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేసింది. ఈ నిబంధనలను అన్ని బ్యాంకుల్లో ఒకే విధంగా అమలు చేయడానికి అవసరమైన 'బ్యాంకింగ్ కంపెనీల (నామినేషన్) నిబంధనలు-2025'ను, సంబంధిత ఫారాలను త్వరలోనే విడుదల చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు.

## 'తుని' నిందితుడి ఆత్మహత్య

కాకినాడ జిల్లా తునిలో సంచలనం సృష్టించిన బాలిక అత్యాచారం కేసులో నిందితుడు తాటిక నారాయణరావు (62) ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. బుధవారం అర్ధరాత్రి కోర్టుకు తరలిస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. మైనర్ బాలిక అత్యాచారం కేసులో అరెస్టయిన నారాయణరావును తుని రూరల్ పోలీస్ స్టేషన్ నుంచి కోర్టుకు తీసుకెళ్తుండగా, మధ్యలో బహిర్భూమికి వెళ్తానని చెప్పి పట్టణ శివారులోని కోమటి చెరువులో దూకినట్లు పోలీసులు తెలిపారు. గజ ఈతగాళ్ల సాయంతో గాలింపు చర్యలు చేపట్టగా, చెరువులో నిందితుడి మృతదేహం లభ్యమైంది. మనవరాలి వయసున్న బాలికపై నారాయణరావు అఘాయిత్యానికి పాల్పడ్డాడు. గురుకుల పాఠశాలలో చదువుతున్న ఆ బాలికకు తినుబండారాలు కొనిపెట్టి మాయమాటలు చెప్పి దగ్గరయ్యాడు. తాను ఆమెకు తాతనని పాఠశాల సిబ్బందిని నమ్మబలికాడు. బాలిక ఆరోగ్యం బాగోలేదని ఆసుపత్రికి తీసుకెళ్తానంటూ మంగళవారం ఆమెను పాఠశాల నుంచి బయటకు తీసుకెళ్లి, తొండంగి సమీపంలోని తోటలో అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ ఘటనను ఒకరు వీడియో తీయడంతో అది సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. విషయం తెలిసిన బాలిక కుటుంబ సభ్యులు, స్థానికులు నిందితుడిపై దాడి చేశారు. అనంతరం పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. అయితే కోర్టుకు తరలిస్తుండగా అతను ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటన తుని పరిసర ప్రాంతాల్లో తీవ్ర కలకలం రేపింది.

# మగాడివైతే మాతో పోరాడు

**పాక్ ఆర్మీ చీఫ్‌కు టీటీపీ సవాల్**

ఇస్లామాబాద్: పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్‌ను లక్ష్యంగా చేసుకుని తెహ్రీక్-ఏ-తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ) తీవ్రవాద సంస్థ సవాల్ విసిరింది. "సాధారణ సైనికులను చనిపోయేందుకు పంపడం ఆపి, ధైర్యముంటే ఉన్నతాధికారులు యుద్ధ క్షేత్రంలోకి రావాలి" అంటూ ఆ సంస్థకు చెందిన ఓ కీలక కమాండర్ హెచ్చరికలు జారీ చేశాడు. ఈ మేరకు విడుదల చేసిన వరుస వీడియోలు పాకిస్థాన్ సైనిక నాయకత్వాన్ని తీవ్ర ఇరకాటంలోకి నెట్టాయి. పాక్ అధికారుల సమాచారం ప్రకారం, వీడియోలో కనిపించిన వ్యక్తిని టీటీపీ సీనియర్ కమాండర్ కాజిమ్‌గా గుర్తించారు. "నువ్వు నిజమైన మగాడివైతే మాతో పోరాడు. తల్లిపాలు తాగిన వాడివైతే మాతో యుద్ధం చెయ్" అంటూ అతడు నేరుగా ఆర్మీ చీఫ్‌ను ఉద్దేశించి సవాలు విసిరాడు.



ఈ వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించిన పాకిస్థాన్ ప్రభుత్వం, ఈ నెల 21న కమాండర్ కాజిమ్ ఆచూకీ తెలిపిన వారికి 10 కోట్ల పాకిస్థానీ రూపాయల (పీకేఆర్) రివార్డును ప్రకటించింది. ఈ నెల 8న ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లోని కుర్రం జిల్లాలో పాక్ సైన్యంపై జరిపిన మెరుపుదాడికి సంబంధించిన దృశ్యాలను కూడా టీటీపీ విడుదల చేసింది. ఈ దాడిలో 22 మంది సైనికులను హతమార్చామని, వారి ఆయుధాలు, వాహనాలను స్వాధీనం చేసుకున్నామని టీటీపీ ప్రకటించింది. అయితే, ఈ ఘటనలో 11 మంది సైనికులు మాత్రమే మరణించారని పాకిస్థాన్ సైన్యం అధికారికంగా అంగీకరించింది. ఇటీవల ఖతార్, టర్కీ మధ్యవర్తిత్వంతో పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్‌లోని తాలిబన్ ప్రభుత్వాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. ఆఫ్ఘన్ భూభాగం నుంచి పనిచేస్తున్న టీటీపీ వంటి సాయుధ గ్రూపులపై కఠిన చర్యలు తీసుకుంటేనే ఈ ఒప్పందం నిలుస్తుందని పాకిస్థాన్ స్పష్టం చేసింది. అయినప్పటికీ, టీటీపీ దాడులు ఏమాత్రం తగ్గలేదు. టీటీపీ దూకుడు ఇతర హింసాత్మక సంస్థలైన లష్కరే జాంగ్వి, ఇస్లామిక్ స్టేట్ ఖొరసాన్ ప్రావిన్స్ వంటి వాటికి కూడా ధైర్యాన్ని ఇస్తోందని పాకిస్థానీ మీడియా వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

## వరకట్న వేధింపులు.. 10 ఏళ్ల జైలు

జగిత్యాల టౌన్, అక్టోబర్ 23 (ఈవార్తలు): జగిత్యాల జిల్లాకేంద్రంలో ఆత్మహత్యకు పాల్పడ్డ మహిళ కేసులో నిందితుడు భర్తకు జగిత్యాల ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టు పదేళ్ల జైలు శిక్ష విధించింది. అంతేకాకుండా, రూ.10 వేల జరిమానా విధించింది. వివరాల్లోకెళితే.. బీర్పూర్ మండలంలోని మంగేళ గ్రామానికి చెందిన లహరి (ప్రియాంక)కు సారంగాపూర్ మండలంలోని కోనాపూర్ గ్రామానికి చెందిన కొమురోజు రాజేందర్‌తో వివాహం జరిగింది. వివాహం తర్వాత కొంతకాలానికి రాజేందర్ అదనపు వరకట్నం కోసం లహరిని శారీరకంగా, మానసికంగా వేధించాడు. భర్త వేధింపులు భరించలేక లహరి 2019 సెప్టెంబర్ 22న జగిత్యాల పట్టణంలో తాను ఉంటున్న అద్దె ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు.. నిందితుడిపై నేరారోపణలు రుజువు చేశారు. దీంతో జైలు శిక్ష పడింది. మరో కేసులో వరకట్న వేధింపులు, చంపుతానని బెదిరించిన కేసులో నిందితుడికి (గంగాధర మండలం చర్లపల్లికి చెందిన శ్రీనివాస్) 3 ఏళ్ల జైలు శిక్ష పడింది.

## నందగిరిలో రోడ్డు ప్రమాదం.. ఒకరి మృతి

పెగడపల్లి, అక్టోబర్ 23 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం నందగిరి రైతు వేదిక సమీపంలో రోడ్డు ప్రమాదం ఒకరు మృతి చెందారు. ఈ ఘటనలో మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. జగిత్యాల మండలం సోమనపల్లికి చెందిన చెట్ల వంశీ, ఉప్పర రంజిత్ పెళ్లి పత్రికలు పంచడానికి ఐతుపల్లి వచ్చి తిరిగి వెళ్లే క్రమంలో నందగిరి రైతు వేదిక వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో చెట్ల వంశీ అక్కడికక్కడే మృతి చెందాడు, ఉప్పర రంజిత్‌కి తీవ్ర గాయాలపాలయ్యాడు. వెంటనే సమాచారం అందుకున్న ఎస్ఐ కిరణ్ కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తుచేపట్టారు.

## బస్సులో అధిక లోడ్.. ఊడిన టైరు

**త్రుటిలో ముప్పు తప్పిన ధర్మపురి ఆర్టీసీ బస్సు**



ధర్మపురి, అక్టోబర్ 23 (ఈవార్తలు): ధర్మపురి నుండి జగిత్యాల వైపుకు ప్రయాణిస్తున్న ఆర్టీసీ బస్సు (నంబర్ టీఎస్ 02 యూఏ 9775)లో గురువారం మధ్యాహ్నం ఆందోళనకర ఘటన చోటుచేసుకుంది. 65 మందికి సామర్థ్యం ఉన్న ఆ బస్సులో సుమారు 115 మంది ప్రయాణికులు ఉండగా, నేరెళ్ల గ్రామ బస్‌స్టాండ్ సమీపంలో బస్సు అధిక లోడ్ కారణంగా టైరు ఊడిపోయింది. వెంటనే డ్రైవర్ చాకచక్యంగా బస్సును ఆపడంతో ముప్పు తప్పింది. అయితే టైరు పేలిన శబ్దంతో ప్రయాణికులు భయాందోళనకు గురై, బస్సు తిరుగుతుందేమో అనే భయంతో బస్సు నుంచి హుటాహుటిన దిగిపోయారు. ప్రమాదం పెద్దది కాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. బస్సులో పరిమితికి మించి ఎక్కించుకోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ప్రయాణికులు మండిపడుతున్నారు. ఆర్టీసీ బస్సుల్లో అధిక లోడ్ నియంత్రణపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

## కేసీఆర్‌తోనే హైదరాబాద్ అభివృద్ధి

**బాబుకు సంబంధం లేదు: వైఎస్ జగన్**



తాడేపల్లి, అక్టోబర్ 23 (ఈవార్తలు): వైసీపీ అధినేత, ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబుపై సంచలన వ్యాఖ్యలు చేశారు. 20 ఏళ్ల పాటు హైదరాబాద్‌తో చంద్రబాబుకు సంబంధమే లేదని విమర్శించారు. హైటెక్ సిటీకి నాటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్ శంకు స్థాపన చేయగా హైటెక్ సిటీ అభివృద్ధి తన వల్లేనంటూ బీరాలు పలుకుతున్నారని ఆరోపించారు. తాడేపల్లి నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కూటమి పాలన, చంద్రబాబు వ్యవహారశైలీపై విరుచుకుపడ్డారు. 2003-04లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాం నుంచే హైదరాబాద్‌లో నిజమైన అభివృద్ధి మొదలైందని పేర్కొన్నారు. కేసీఆర్ రెండుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేయడంతో హైదరాబాద్ నగరం శరవేగంగా అభివృద్ధి చెందిందని ప్రశంసించారు. కానీ చంద్రబాబు నిజాలను ఎప్పుడు అంగీకరించరని తెలిపారు. ఏపీ ఉద్యోగులకు బాబు అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఎన్నికలయ్యాక, ఉద్యోగులకు మెరుగైన పీఆర్సీ, ఐఆర్ గురించి, అనేక వాగ్దానాలు చేశారని గుర్తు చేశారు. ఉద్యోగులకు జీపీఎస్ లేదు. ఓపీఎస్ లేదని, ఉద్యోగులను మోసం చేసి వికృత ఆనందం పొందుతున్నారని ఆరోపించారు. ప్రతినెలా ఒకటో తేదీన ఉద్యోగులకు జీతాలు రావడం లేదని పేర్కొన్నారు. వైసీపీ హయాంలో ఉద్యోగులకు 11 డీఏలు ఇచ్చిన ఘనత తమదేనని అన్నారు. టీడీపీ హయాంలో ఒక్క డీఏ ఇవ్వలేదని అన్నారు.

## బెంగాల్‌లో రెండో ప్రపంచ యుద్ధం నాటి బాంబు

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లోని బీర్‌భూమ్ జిల్లాలో తీవ్ర కలకలం రేగింది. రెండో ప్రపంచ యుద్ధం నాటి ఓ భారీ బాంబు బయటపడటంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. విశ్వభారతి యూనివర్సిటీకి సమీపంలోని బోల్‌పూర్ వద్ద ఉన్న లౌదహా గ్రామంలో ఈ ఘటన వెలుగుచూసింది. దాదాపు 80 ఏళ్లుగా భూమిలో ఉన్న ఈ బాంబును సైన్యం సురక్షితంగా నిర్వీర్యం చేయడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. వివరాల్లోకి వెళితే... సుమారు నెల రోజుల క్రితం అజయ్ నది ఒడ్డున స్థానిక జాలర్లకు సిలిండర్ ఆకారంలో ఉన్న ఓ పాత లోహపు వస్తువు కనిపించింది. మొదట దాన్ని పెద్దగా పట్టించుకోకపోయినా, అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు ఆ ప్రాంతాన్ని తమ అధీనంలోకి తీసుకుని, ప్రజలు అటువైపు వెళ్లకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆర్మీ అధికారులకు విషయం తెలియజేశారు. బుధవారం ఘటనా స్థలానికి చేరుకున్న ఆర్మీ బాంబ్ స్క్వాడ్, దానిని రెండో ప్రపంచ యుద్ధం నాటి బాంబుగా గుర్తించింది. అత్యంత జాగ్రత్తగా, నియంత్రిత పద్ధతిలో బాంబును పేల్చివేయగా, ఆ ధాటికి సమీప గ్రామాలు సైతం కంపించాయని స్థానికులు తెలిపారు. ఎనభై ఏళ్లు దాటినా బాంబు ఇంకా పేలుడు సామర్థ్యంతో ఉండటం ఆశ్చర్యం కలిగించింది. "ఆర్మీ అధికారుల సమక్షంలో నిన్న బాంబును నిర్వీర్యం చేశాం. బాంబు దొరికినప్పటి నుంచి స్థానికంగా నెలకొన్న భయాందోళనలు ఇప్పుడు తొలగిపోయాయి. పరిస్థితి అదుపులోకి వచ్చింది" అని బీర్‌భూమ్ జిల్లాకు చెందిన ఓ సీనియర్ పోలీస్ అధికారి గురువారం ఉదయం తెలిపారు. అయితే, 80 ఏళ్ల క్రితం నాటి బాంబు ఆ ప్రాంతానికి ఎలా చేరిందనే విషయంపై మిస్టరీ కొనసాగుతోంది. కాగా, గతేడాది కూడా ఝార్గ్రామ్ జిల్లాలో ఇలాంటి ఘటనే చోటుచేసుకుంది. అక్కడ కూడా రెండో ప్రపంచ యుద్ధం నాటి బాంబును అధికారులు నిర్వీర్యం చేశారు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో ఝార్గ్రామ్‌లో ఫైటర్ విమానాల కోసం ఎయిర్ స్ట్రిప్ ఉండేదని, బరువు తగ్గించుకోవడం కోసం విమానాలు కొన్నిసార్లు బాంబులను అక్కడ జారవిడిచేవని చెబుతుంటారు.

# చిలీలో ఎండిపోతున్న భూములు

## ఎలక్ట్రిక్ కార్ల బ్యాటరీల కోసం లిథియంకు డిమాండ్.. లిథియం ఉత్పాదక దేశమైన చిలీలో మైనింగ్ ఉద్ధృతి

### భూగర్భ జలాలు అడుగంటి ఎండిపోతున్న వ్యవసాయ క్షేత్రాలు.. నీటి కొరతతో జీవవైవిధ్యంపై తీవ్ర ప్రభావం

న్యూయార్క్: ప్రపంచం పర్యావరణ పరిరక్షణ కోసం ఎలక్ట్రిక్ వాహనాల వైపు పరుగులు పెడుతోంది. కానీ, ఈ హరిత ప్రయాణం మరో తీవ్రమైన పర్యావరణ సంక్షోభానికి దారితీస్తోందా? చిలీలోని అటకామా ఎడారిలో జరుగుతున్న పరిణామాలు ఈ అనుమానాలకు బలం చేకూరుస్తున్నాయి. ఎలక్ట్రిక్ కార్ల బ్యాటరీలలో అత్యంత కీలకమైన లిథియం వెలికితీత, అక్కడి స్థానిక ప్రజల జీవితాలను, పర్యావరణాన్ని ఛిద్రం చేస్తోంది. చిలీలోని అటకామా ఉప్పు వన ప్రాంతాలు ప్రపంచంలోనే అతిపెద్ద లిథియం నిల్వలకు నిలయం. ఎలక్ట్రిక్ కార్లకు డిమాండ్ పెరగడంతో లిథియం వినియోగం కూడా విపరీతంగా పెరిగింది. అంతర్జాతీయ ఇంధన ఏజెన్సీ (%×జూూ%) ప్రకారం, 2021లో 95,000 టన్నులుగా ఉన్న ప్రపంచ లిథియం వినియోగం, 2024 నాటికి రెట్టింపు కంటే ఎక్కువగా 2,05,000 టన్నులకు చేరింది. ఈ డిమాండ్‌ను అందిపుచ్చుకునేందుకు చిలీ ప్రభుత్వం, మైనింగ్ కంపెనీలు ఉత్పత్తిని భారీగా పెంచేందుకు ప్రణాళికలు రచిస్తున్నాయి. అయితే, ఈ అభివృద్ధి స్థానిక ఆదివాసీ సమాజాలకు శాపంగా మారింది. "ఒకప్పుడు ఈ ప్రాంతమంతా పచ్చగా ఉండేది. కానీ ఇప్పుడు అంతా ఎండిపోయింది" అని స్థానిక మహిళ రాక్వెల్ సెలినా రోడ్రిగ్జ్ ఆవేదన వ్యక్తం చేశారు. తరతరాలుగా గొర్రెల పెంపకంతో జీవనం



సాగిస్తున్న తమ కుటుంబాలకు, ఇప్పుడు పచ్చిక బయళ్లు ఎండిపోవడంతో జీవనాధారం కష్టంగా మారిందని ఆమె వాపోయారు. లిథియం వెలికితీత ప్రక్రియలో భాగంగా, కంపెనీలు భూగర్భంలోని ఉప్పునీటిని భారీగా పైకి తోడి, పెద్ద పెద్ద ఆవిరి కొలనులలో నిల్వ ఉంచుతాయి. సూర్యరశ్మికి నీరు ఆవిరైపోగా, లిథియం మిగిలిపోతుంది. ఇప్పటికే కరవుతో అల్లాడుతున్న ఈ ప్రాంతంలో, ఈ ప్రక్రియ వల్ల భూగర్భ జలాలు ప్రమాదకర స్థాయిలో అడుగంటిపోతున్నాయి. "ఇక్కడి సరస్సులు కుచించుకుపోయాయి. ఫ్లెమింగో పక్షుల సంతానోత్పత్తి గణనీయంగా తగ్గిపోయింది" అని స్థానిక జీవశాస్త్రవేత్త ఫావియోలా గొంజాలెజ్ తెలిపారు. నీటిలో పక్షులకు ఆహారంగా ఉపయోగపడే సూక్ష్మజీవులు లిథియం మైనింగ్ వల్ల ప్రభావితం కావడంతో, మొత్తం ఆహార గొలుసు దెబ్బతింటోందని ఆమె వివరించారు. ఈ ప్రాంతంలోని నదీ బేసిన్‌లు ఇప్పటికే ఎండిపోయినట్లు దశాబ్దం క్రితమే చిలీ ప్రభుత్వం అధికారికంగా ప్రకటించడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. మైనింగ్ కంపెనీలు మాత్రం తమ వాదనను వినిపిస్తున్నాయి. తాము స్థానిక సమాజాల ఆందోళనలను అర్థం చేసుకున్నామని, పర్యావరణ నష్టాన్ని తగ్గించేందుకు కొత్త టెక్నాలజీలను పరీక్షిస్తున్నామని ఎస్క్యూఎం కంపెనీ ప్రతినిధి వాలెంటిన్ బర్రెరా తెలిపారు. ఆవిరయ్యే నీటిని తిరిగి భూమిలోకి పంపించడం వంటి ప్రయోగాలు చేస్తున్నామని, 2031 నుంచి నీటి వాడకాన్ని 50% తగ్గిస్తామని ఆయన హామీ ఇచ్చారు. అయితే, స్థానికులు ఈ హామీలను నమ్మడం లేదు. "మా ప్రాంతాన్ని ఒక ప్రయోగశాలగా వాడుకుంటున్నారు. ఈ కొత్త టెక్నాలజీ విఫలమైతే మా పరిస్థితి ఏంటి?" అని వారు ప్రశ్నిస్తున్నారు. "మాకు కంపెనీలు ఇచ్చే డబ్బు వద్దు. ప్రకృతితో కలిసి బతకడానికి అవసరమైన నీళ్లు ఉంటే చాలు" అని మరో స్థానిక మహిళ సారా ప్లాజా కన్నీటిపర్యంతమయ్యారు. ప్రపంచం హరిత శక్తి వైపు వెళ్లడం అవసరమే అయినా, ఆ భారాన్ని తమ లాంటి ఆదివాసీ సమాజాలు మోయాలా అని వారు ప్రశ్నిస్తున్నారు. "ఈ ఎలక్ట్రిక్ కార్లు ఎవరి కోసం? యూరోపియన్లు, అమెరికన్ల కోసం. కానీ, దానికోసం మా నీటిని తోడేస్తున్నారు. మా పవిత్రమైన పక్షులు కనుమరుగవుతున్నాయి" అని ఫావియోలా ఆవేదన వ్యక్తం చేశారు. పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రపంచం ఎంచుకున్న మార్గం, మరో ప్రాంతంలో పర్యావరణాన్ని నాశనం చేయడం తీవ్రమైన వైరుధ్యమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

---


# ఆరో రోజూ లాభాలే!



ముంబై: భారత స్టాక్ మార్కెట్లు వరుసగా ఆరో రోజూ లాభాల బాటలో పయనించాయి. ముఖ్యంగా ఐటీ షేర్లలో వెల్లువెత్తిన కొనుగోళ్ల మద్దతుతో సూచీలు గురువారం కూడా లాభాలతో ముగిశాయి. అయితే, ట్రేడింగ్ చివరి గంటల్లో లాభాల స్వీకరణ జరగడంతో ఇంట్రాడే గరిష్ఠాల నుంచి కిందకు జారాయి. ట్రేడింగ్ సమయంలో బీఎస్ఈ సెన్సెక్స్ 864 పాయింట్ల వరకు లాభపడి 85,290 వద్ద కొత్త 52 వారాల గరిష్ఠాన్ని తాకింది. కానీ చివరికి 130 పాయింట్ల స్వల్ప లాభంతో 84,556 వద్ద ముగిసింది. అదేవిధంగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా ఇంట్రాడేలో 26,104 స్థాయికి చేరినప్పటికీ, చివరకు కేవలం 23 పాయింట్ల లాభంతో 25,891 వద్ద ఫ్లాట్‌గా స్థిరపడింది. ఉదయం వచ్చిన లాభాలను నిఫ్టీ పూర్తిగా కోల్పోయిందని విశ్లేషకులు తెలిపారు. ఐటీ రంగ షేర్లు ఈ ర్యాలీని ముందుండి నడిపించాయి. ఇన్ఫోసిస్ ప్రమోటర్లు రూ.18,000 కోట్ల షేర్ల బైబ్యాక్‌లో పాల్గొనబోమని ప్రకటించడంతో ఆ సంస్థ షేరు ఏకంగా 4 శాతం పెరిగింది. దీనికి తోడు, భారత్-అమెరికా మధ్య త్వరలో వాణిజ్య ఒప్పందం కుదరవచ్చన్న వార్తల నేపథ్యంలో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టీసీఎస్ షేర్లు కూడా రెండు శాతానికి పైగా లాభపడ్డాయి. బీఎస్ఈ ఐటీ ఇండెక్స్ 2.2 శాతం పెరిగింది. ఇతర లాభపడిన షేర్లలో యాక్సిస్ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్, టైటాన్, టాటా మోటార్స్ ఒక శాతానికి పైగా వృద్ధి చెందాయి. మరోవైపు, ఎటర్నల్ 3 శాతంతో టాప్ లూజర్‌గా నిలవగా, భారతీ ఎయిర్‌టెల్, అల్ట్రాటెక్ సిమెంట్, ఐసీఐసీఐ బ్యాంక్, రిలయన్స్ షేర్లు 1 నుంచి 2 శాతం మధ్య నష్టపోయాయి. అయితే, బ్రాడర్ మార్కెట్‌లో సెంటిమెంట్ బలహీనంగానే ఉంది. బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.2 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.5 శాతం చొప్పున క్షీణించాయి. ఇదే సమయంలో, అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదరవచ్చన్న ఆశలతో రూపాయి బలపడింది. డాలర్‌తో పోలిస్తే 19 పైసలు లాభపడి 87.82 వద్ద స్థిరపడింది.

# బీహార్ 'జంగల్‌రాజ్'ను మర్చిపోలేం

**ఆర్జేడీ పాలనపై ప్రధాని మోదీ సెటైర్లు**



పాట్నా: బిహార్‌లో ఆర్జేడీ 'జంగల్ రాజ్' (ఆటవిక పాలన)పై మరో వందేళ్లయినా చర్చ జరుగుతూనే ఉంటుందని ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. ప్రతిపక్షాలు తమ దురాగతాలను దాచిపెట్టేందుకు ఎంత ప్రయత్నించినా.. ప్రజలు క్షమించరన్నారు. ప్రతిపక్షాలది 'మహాగఠ్‌బంధన్' కాదని.. 'లఠ్‌బంధన్ (నేరస్థుల కూటమి)' అని విమర్శించారు. ఆ పార్టీల నేతలంతా బెయిల్‌పై బయట తిరుగుతున్నవారేనని పేర్కొన్నారు. 'మేరా బూత్ సబ్‌సే మజ్‌బూత్: యువ సంవాద్' ఆడియో కాన్ఫరెన్స్‌లో ప్రధాని మోదీ ఈ మేరకు ప్రసంగించారు. బిహార్‌లో ఆర్జేడీ పాలనలో సాగిన అకృత్యాలపై నేటి తరం యువకులకు అవగాహన కల్పించేలా బీజేపీ శ్రేణులు చొరవ తీసుకోవాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. దేశంలో ఎన్డీయే సర్కారు నేతృత్వంలో అభివృద్ధి మహాయజ్ఞం జరుగుతోందన్నారు. బీహార్ సైతం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందన్నారు. కేంద్రం, రాష్ట్రంలో స్థిరమైన ప్రభుత్వం ఉండటం వల్లే ఇది సాధ్యమైందని చెప్పారు. అందుకే.. స్థానిక యువత సైతం 'వేగంగా దూసుకెళ్తోంది బిహార్.. మరోసారి ఎన్డీయే సర్కార్' అని నినదిస్తున్నట్లు తెలిపారు. "ప్రతిపక్ష నేతలకు తమలో తాము ఎలా పోట్లాడాలో, స్వప్రయోజనాలను ఎలా కాపాడుకోవాలో మాత్రమే తెలుసు. బిహార్‌ను ఆటవిక రాజ్యం నుంచి బయటకు తీసుకొచ్చేందుకు, శాంతిభద్రతలను నెలకొల్పేందుకు సీఎం నీతీశ్‌కుమార్, ఎన్డీయే నేతలు ఎంతో కృషి చేశారు. స్థానికంగా మావోయిస్టులను నిర్మూలించే దిశగా ప్రభుత్వం వేగంగా ముందుకు సాగుతోంది. రాష్ట్రంలో టెక్నాలజీ, స్టార్టప్ హబ్‌లను సృష్టించాల్సిన అవసరం ఉంది. ఈ ఎన్నికలు రాష్ట్ర చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని లిఖిస్తాయి. యువత కీలక పాత్ర పోషిస్తుంది" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

# లక్ష దాటిన జిమ్నీ ఎగుమతులు

**విదేశాల్లో అనూహ్య స్పందన.. వందకు పైగా దేశాలకు ఎగుమతి**

న్యూఢిల్లీ: భారత ఆటోమొబైల్ దిగ్గజం మారుతి సుజుకి, 'మేక్ ఇన్ ఇండియా' స్ఫూర్తితో మరో కీలక మైలురాయిని అందుకుంది. భారత్‌లో తయారై ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటున్న జిమ్నీ 5-డోర్ ఎస్‌యూవీ ఎగుమతులు లక్ష యూనిట్లను దాటినట్లు కంపెనీ గురువారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఇది భారత తయారీ రంగానికి గర్వకారణంగా నిలుస్తోంది. 2023లో భారత మార్కెట్లో అడుగుపెట్టిన కొద్దికాలానికే జిమ్నీ 5-డోర్ ఎస్‌యూవీ అంతర్జాతీయ ప్రయాణాన్ని ప్రారంభించింది. భారత్‌లో ప్రత్యేకంగా తయారవుతున్న ఈ వాహనాన్ని జపాన్, మెక్సికో, ఆస్ట్రేలియా వంటి 100కు పైగా దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. ముఖ్యంగా, నాణ్యతకు అధిక ప్రాధాన్యతనిచ్చే జపాన్ మార్కెట్లోనూ జిమ్నీ సత్తా చాటుతోంది. అక్కడ 'జిమ్నీ నొమాడ్' పేరుతో ఈ ఏడాది జనవరిలో విడుదలైన ఈ కారుకు అనూహ్య స్పందన లభించింది. విడుదలైన కొద్ది రోజుల్లోనే 50,000కు పైగా ఆర్డర్లు రావడం విశేషం. ఈ విజయంపై మారుతి సుజుకి ఇండియా మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో హిసాషి టేకుచి హర్షం వ్యక్తం చేశారు. "జిమ్నీ 5-డోర్ లక్ష ఎగుమతుల మార్కును దాటడం మాకు గర్వకారణం. ఈ ఎస్‌యూవీపై ప్రపంచవ్యాప్తంగా ఉన్న కస్టమర్లు చూపిన నమ్మకానికి మేం కృతజ్ఞతలు తెలుపుతున్నాం" అని ఆయన అన్నారు. జిమ్నీ ఆఫ్-రోడ్ సామర్థ్యం, నమ్మకమైన పనితీరు, నాణ్యత వందకు పైగా దేశాల్లో ప్రశంసలు అందుకున్నాయని ఆయన తెలిపారు. జిమ్నీ విజయంతో పాటు మారుతి సుజుకి మొత్తం ఎగుమతులు కూడా గణనీయంగా పెరుగుతున్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధంలోనే కంపెనీ 2 లక్షలకు పైగా వాహనాలను ఎగుమతి చేసి, 40 శాతం వృద్ధిని నమోదు చేసింది. భారత ప్రయాణికుల వాహనాల ఎగుమతుల్లో మారుతి సుజుకి ప్రస్తుతం 46 శాతానికి పైగా వాటాను కలిగి ఉంది. ఇది ప్రపంచస్థాయి ఆటోమొబైల్ తయారీ కేంద్రంగా భారత్ ఎదుగుదలకు నిదర్శనమని కంపెనీ పేర్కొంది.

# మహాకూటమి పోస్టర్ల నుంచి రాహుల్ ఫొటో మాయం

పాట్నా: బీహార్ అసెంబ్లీ ఎన్నికల వేళ ప్రతిపక్ష మహాకూటమిలో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. కూటమి ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ పోస్టర్ల నుంచి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఫొటో మాయమవడం రాజకీయంగా కలకలం రేపుతోంది. పాట్నాలోని మౌర్య హోటల్‌లో గురువారం జరిగిన మీడియా సమావేశం పోస్టర్‌లో ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ ఫొటోను ప్రముఖంగా ప్రదర్శించారు. మిగతా భాగస్వామ్య పక్షాల నేతల చిన్న ఫొటోలు ఉన్నా, రాహుల్ గాంధీ ఫొటో మాత్రం ఎక్కడా కనిపించలేదు. ఈ పరిణామంపై బీజేపీ వెంటనే విమర్శలు ఎక్కుపెట్టింది. "నిన్నటి వరకు రాహుల్ గాంధీయే కూటమి ముఖచిత్రం అన్నారు. కానీ ఇప్పుడు చూస్తుంటే కాంగ్రెస్ పార్టీకి ఏమాత్రం గౌరవం లేదని స్పష్టమవుతోంది. ఈ కూటమికి ఒక లక్ష్యం గానీ, ఒక దార్శనికత గానీ లేవు. గందరగోళం, విభజన, పదవుల కోసం ఆశ తప్ప ఏమీ లేదు. ఇంకా అభ్యర్థులనే ఖరారు చేయలేని పరిస్థితిలో ఉన్నారు" అని బీజేపీ నేత షెహజాద్ పూనావాలా ఎద్దేవా చేశారు. మరో బీజేపీ నేత ప్రదీప్ భండారి స్పందిస్తూ "తేజస్వి యాదవ్, ఆయన మద్దతుదారులు రాహుల్ గాంధీ నాయకత్వాన్ని అవమానించారు.

---

## ప్రిస్క్రిప్షన్ లేకుండానే

# ఎమర్జెన్సీ పిల్

**జపాన్‌లో తొలిసారిగా అమ్మకానికి ఆమోదం**

**మహిళల పునరుత్పత్తి**

**ఆరోగ్య హక్కుల దిశగా నిర్ణయం**




టోక్యో: మహిళల ఆరోగ్య హక్కుల విషయంలో జపాన్ ప్రభుత్వం ఒక చారిత్రక నిర్ణయం తీసుకుంది. దేశంలో మొట్టమొదటిసారిగా అత్యవసర గర్భనిరోధక మాత్రలను (మార్నింగ్-ఆఫ్టర్ పిల్) డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా నేరుగా ఫార్మసీల్లో విక్రయించడానికి అనుమతి ఇచ్చింది. ఈ నిర్ణయం దేశంలోని మహిళల పునరుత్పత్తి ఆరోగ్య హక్కుల సాధనలో ఒక కీలక ముందడుగుగా భావిస్తున్నారు. ప్రముఖ ఔషధ తయారీ సంస్థ ఆస్కా ఫార్మాస్యూటికల్ తయారు చేస్తున్న 'నార్లెవో' అనే ఈ పిల్ అమ్మకాలకు ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. అయితే, దీనిని 'గైడెన్స్ అవసరమైన మందు' కేటగిరీలో చేర్చారు. అంటే, ఈ మాత్రను కొనుగోలు చేసే మహిళలు తప్పనిసరిగా ఫార్మసిస్ట్ సమక్షంలోనే దాన్ని తీసుకోవాల్సి ఉంటుంది. కాగా, ఈ పిల్ ఎప్పటి నుంచి మార్కెట్లో అందుబాటులోకి వస్తుందనే తేదీని కంపెనీ ఇంకా ప్రకటించలేదు. ఈ మాత్ర కొనుగోలుకు ఎలాంటి వయోపరిమితి గానీ, తల్లిదండ్రుల అనుమతి గానీ అవసరం లేదని అక్కడి మీడియా కథనాలు స్పష్టం చేశాయి. సురక్షితం కాని లైంగిక చర్య జరిగిన 72 గంటల్లోపు ఈ మాత్రను తీసుకుంటే గర్భం దాల్చకుండా 80 శాతం వరకు నివారించవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఇది అండం పూర్తిగా అభివృద్ధి చెందకుండా లేదా గర్భాశయానికి అంటుకోకుండా నిరోధిస్తుంది. సంప్రదాయ, పితృస్వామ్య భావజాలం బలంగా ఉన్న జపాన్‌లో మహిళల ఆరోగ్యానికి సంబంధించిన ఔషధాలపై ఆమోదం పొందడం అంత సులభం కాదు. ప్రపంచవ్యాప్తంగా 90కి పైగా దేశాల్లో ఈ తరహా అత్యవసర గర్భనిరోధక మాత్రలు ప్రిస్క్రిప్షన్ లేకుండా లభిస్తున్నప్పటికీ, జపాన్‌లో మాత్రం ఇన్నేళ్లుగా దీనిపై చర్చ జరుగుతూనే ఉంది. 2017లో ఈ అంశం తొలిసారిగా ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్యానెల్ ముందుకు రాగా, దీనివల్ల బాధ్యతారహిత వినియోగం పెరుగుతుందనే ఆందోళనలతో ఆమోదం లభించలేదు. అయితే, హక్కుల సంఘాలు ఏళ్లుగా చేస్తున్న పోరాటాలు, యువతులు, అత్యాచార బాధితులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం, గతేడాది ప్రయోగాత్మకంగా 145 ఫార్మసీల్లో ఈ మాత్రల అమ్మకానికి అనుమతించింది. ఆ ట్రయల్స్ విజయవంతం కావడంతో, ఆస్కా ఫార్మాస్యూటికల్ ఈ ఏడాది పూర్తిస్థాయి అనుమతుల కోసం దరఖాస్తు చేయగా, తాజాగా ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

## జెన్ జీ.. ఇండియాలో

# మౌనమేల!?

**నేపాల్, బంగ్లాదేశ్‌లో ప్రభుత్వాలను కూల్చేసిన యువత**

**భారత్‌లో మాత్రం మౌనంగానే 37 కోట్ల మంది**

**'దేశద్రోహి' ముద్ర, ఉద్యోగాల భయాలే ప్రధాన కారణాలు**



న్యూఢిల్లీ: ఆసియా, ఆఫ్రికాలోని పలు దేశాల్లో 'జెన్ జీ' (1997-2012 మధ్య పుట్టిన తరం) యువత ప్రభుత్వాలనే కూల్చేస్తుంటే, ప్రపంచంలోనే అత్యధిక యువ జనాభా ఉన్న భారత్‌లో మాత్రం అలాంటి వాతావరణం కనిపించడం లేదు. దేశంలో దాదాపు 37 కోట్ల మంది జెన్ జీ యువత ఉన్నప్పటికీ, అవినీతి, నిరుద్యోగం, అసమానతలపై తీవ్ర అసంతృప్తితో ఉన్నా.. వారు భారీ ఉద్యమాలకు ఎందుకు దూరంగా ఉంటున్నారనే విషయంపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. ఇటీవల నేపాల్‌లో యువత కేవలం 48 గంటల్లో ప్రభుత్వాన్ని గద్దెదించింది. బంగ్లాదేశ్, ఇండోనేషియా వంటి దేశాల్లోనూ యువతరం ఆందోళనలతో ప్రభుత్వాలు దిగివచ్చిన సంఘటనలు ఉన్నాయి. సోషల్ మీడియా, ఎన్‌క్రిప్టెడ్ యాప్‌ల ద్వారా వేగంగా ఏకమై, అవినీతిపై పోరాడుతూ వారు సంచలనాలు సృష్టిస్తున్నారు. ఈ పరిణామాలను గమనిస్తున్న భారత ప్రభుత్వం కూడా అప్రమత్తమైంది. ముఖ్యంగా నేపాల్ పరిణామాల నేపథ్యంలో, ఢిల్లీలో యువత ఆందోళనలు చేపట్టే అవకాశం ఉందన్న అంచనాలతో పోలీసులు అత్యవసర ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. భారత్‌లో యువత రోడ్ల మీదకు వచ్చి పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టకపోవడానికి అనేక కారణాలు కనిపిస్తున్నాయి. నిపుణుల విశ్లేషణ ప్రకారం, ప్రధాన కారణం వారి మధ్య ఐక్యత లేకపోవడమే. "భారత్‌లో యువత కులం, మతం, ప్రాంతం, భాష వంటి గుర్తింపులతో బలంగా ముడిపడి ఉంది. దీంతో వారి సమస్యలు, ఆకాంక్షలు కూడా వేర్వేరుగా ఉంటున్నాయి" అని సెంటర్ ఫర్ యూత్ పాలసీకి చెందిన సుధాంశు కౌశిక్ వివరించారు. ఉదాహరణకు, తమిళనాడులో జల్లికట్టు కోసం, గుజరాత్‌లో రిజర్వేషన్ల కోసం జరిగిన నిరసనలు స్థానిక సమస్యలకే పరిమితమయ్యాయి తప్ప దేశవ్యాప్త ఉద్యమాలుగా మారలేదు. మరోవైపు, నిరసనల్లో పాల్గొంటే 'దేశ వ్యతిరేకులు' అనే ముద్ర వేస్తారనే భయం కూడా యువతను వెనక్కి లాగుతోంది. "ఈ రోజుల్లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడితే దేశద్రోహిగా చిత్రీకరిస్తున్నారు. ఈ భయంతో చాలామంది మౌనంగా ఉంటున్నారు" అని ఓ పొలిటికల్ సైన్స్ గ్రాడ్యుయేట్ అభిప్రాయపడ్డారు. దీనికి తోడు, ఒకప్పుడు రాజకీయ చర్చలకు కేంద్రంగా ఉన్న యూనివర్సిటీల్లో కూడా ఇప్పుడు నిరసనలపై ఆంక్షలు పెరిగాయి. ఆర్థిక ఒత్తిళ్లు కూడా యువత దృక్పథాన్ని మారుస్తున్నాయి. ఉద్యమాలు చేయడం కంటే మంచి ఉద్యోగం సంపాదించి స్థిరపడటం లేదా విదేశాలకు వలస వెళ్లడంపైనే ఎక్కువ మంది దృష్టి పెడుతున్నారని నిపుణులు చెబుతున్నారు. రాజకీయ వ్యవస్థపై నమ్మకం సన్నగిల్లడం కూడా మరో కారణం. 2024 ఎన్నికల్లో 18 ఏళ్ల వయసున్న వారిలో కేవలం 38% మాత్రమే ఓటర్లుగా నమోదు చేసుకోవడం దీనికి నిదర్శనం. యువతలో 29% మంది రాజకీయాలకు పూర్తిగా దూరంగా ఉంటున్నట్లు ఓ సర్వేలో తేలింది.

---

## అమెరికా శాటిలైట్..

# ఇస్రో ప్రయోగం

శ్రీహరికోట, అక్టోబర్ 23 (ఈవార్తలు): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరో కీలక వాణిజ్య ప్రయోగానికి సిద్ధమవుతోంది. అమెరికాతో అంతరిక్ష సహకారంలో భాగంగా, ఆ దేశానికి చెందిన ఏఎస్‌టీ స్పేస్‌మొబైల్ అభివృద్ధి చేసిన 'బ్లూబర్డ్-6' అనే భారీ కమ్యూనికేషన్ ఉపగ్రహాన్ని ప్రయోగించనుంది. భారతదేశపు అత్యంత శక్తిమంతమైన ఎల్వీఎం-3 రాకెట్ ద్వారా ఈ ప్రయోగాన్ని చేపట్టనుండటం విశేషం. ఈ ప్రయోగానికి సంబంధించిన వివరాలను ఇస్రో చైర్మన్ డాక్టర్ వి. నారాయణన్ గురువారం వెల్లడించారు. "బ్లూబర్డ్-6 ఒక కమ్యూనికేషన్ ఉపగ్రహం. ఇప్పటికే ఆ శాటిలైట్ అమెరికా నుంచి మా వద్దకు చేరింది. రాకెట్ అనుసంధాన పనులు వేగంగా జరుగుతున్నాయి" అని ఆయన తెలిపారు. ఈ ఏడాది చివరిలోగా ప్రయోగాన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. ప్రయోగ తేదీని సరైన సమయంలో ప్రధానమంత్రి ప్రకటిస్తారని ఆయన స్పష్టం చేశారు. ఇటీవలే నాసా-ఇస్రో సంయుక్తంగా చేపట్టిన నిసార్ మిషన్ విజయవంతమైన నేపథ్యంలో, ఈ తాజా ప్రయోగం ఇరు దేశాల మధ్య అంతరిక్ష భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయనుంది. బ్లూబర్డ్-6 ఉపగ్రహం బరువు 6.5 టన్నులు. ఇది ఇస్రో ప్రయోగించనున్న అత్యంత బరువైన వాణిజ్య ఉపగ్రహాల్లో ఒకటి. అమెరికా నుంచి ఈ ఉపగ్రహం అక్టోబర్ 19న భారతదేశానికి చేరుకుంది. శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి దీనిని భూ నిమ్న కక్ష్యలోకి ప్రవేశపెట్టనున్నారు. ఈ సందర్భంగా ఇస్రో చేపడుతున్న ఇతర ప్రాజెక్టుల గురించి కూడా నారాయణన్ మాట్లాడారు. దేశపు మొట్టమొదటి మానవసహిత అంతరిక్ష యాత్ర 'గగన్‌యాన్' మిషన్‌కు సంబంధించి దాదాపు 85 నుంచి 90 శాతం పనులు పూర్తయ్యాయని ఆయన వెల్లడించారు.




# ఐస్‌ల్యాండ్‌లో దోమలు!


లండన్: ప్రపంచంలో దోమలు లేని స్వర్గధామం ఏదైనా ఉందా అంటే నిన్నమొన్నటి వరకు ఐస్‌లాండ్ పేరు వినిపించేది. కానీ ఇప్పుడు ఆ ప్రత్యేకతకు తెరపడింది. చరిత్రలో తొలిసారిగా ఆ దేశంలో దోమలు కనిపించడం స్థానికంగా కలకలం రేపుతోంది. రికార్డు స్థాయిలో నమోదైన ఉష్ణోగ్రతల కారణంగానే ఈ మార్పు చోటుచేసుకుందని, దోమల ప్రవేశానికి అనువైన వాతావరణం ఏర్పడిందని నిపుణులు భావిస్తున్నారు. ఐస్‌లాండ్ రాజధాని రెక్‌జావిక్‌కు సమీపంలోని క్జోస్ అనే ప్రాంతంలో ఈ దోమలను గుర్తించారు. స్థానికంగా కీటకాలపై పరిశోధన చేసే బ్జోర్న్ హాల్టాసన్ అనే వ్యక్తికి గత వారం ఇవి కనిపించాయి. రాత్రిపూట చిమ్మటలను ఆకర్షించేందుకు వైన్‌లో నానబెట్టిన తాళ్లను ఉపయోగించగా, వాటిపై కొన్ని వింత కీటకాలు వాలాయి. వాటిని చూసిన వెంటనే, తాను మునుపెన్నడూ చూడని జీవులని ఆయన గ్రహించారు. వెంటనే ఆ కీటకాలను పట్టి, ఐస్‌లాండిక్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నేచురల్ హిస్టరీకి పంపించారు. అక్కడి శాస్త్రవేత్త మాథియాస్ ఆల్ఫ్రెడ్‌సన్ వాటిని పరిశీలించి, అవి 'కులిసెటా అనులాటా' అనే జాతికి చెందిన దోమలని నిర్ధారించారు. ఇవి శీతాకాలాన్ని సైతం తట్టుకుని బతకగలవని తెలిపారు. ఈ వార్తను హాల్టాసన్ సోషల్ మీడియాలో పంచుకుంటూ, "దోమలు లేని మన చివరి కోట కూడా కూలిపోయినట్టుంది" అని వ్యాఖ్యానించారు. సాధారణంగా ఐస్‌లాండ్‌లోని శీతల వాతావరణం, దోమలు వృద్ధి చెందడానికి అవసరమైన నిల్వ నీరు లేకపోవడం వంటి కారణాల వల్ల అక్కడ దోమలు ఉండేవి కావు. కానీ ఈ ఏడాది వసంతకాలంలో ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో పెరిగాయి. మే నెలలో వరుసగా 10 రోజుల పాటు ఉష్ణోగ్రత 20 డిగ్రీల సెల్సియస్ దాటింది. ఎగ్లిస్‌స్టాడిర్ 26.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఈ వాతావరణ మార్పులే దోమల మనుగడకు మార్గం సుగమం చేసి ఉంటాయని శాస్త్రవేత్తలు విశ్లేషిస్తున్నారు. అయితే ఈ దోమలు ఐస్‌లాండ్‌లోకి ఎలా ప్రవేశించాయనే దానిపై స్పష్టత లేదు. ఓడలు, కంటైనర్ల ద్వారా ఇక్కడికి చేరి ఉండవచ్చని హాల్టాసన్ అనుమానం వ్యక్తం చేశారు.

# మా దేశ భద్రత మేమే చూసుకుంటాం

**ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ ప్రకటన**

జెరూసలేం: ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కీలక వ్యాఖ్యలు చేశారు. ఇజ్రాయెల్ తన భద్రతను తానే చూసుకుంటుందని ఆయన స్పష్టం చేశారు. "ఇజ్రాయెల్ అమెరికా రక్షిత ప్రాంతం కాదు, మా భద్రతా నిర్ణయాలను మేమే తీసుకుంటాం" అని ఆయన వ్యాఖ్యానించారు. గాజా కాల్పుల విరమణ ఒప్పంద పురోగతిపై చర్చించేందుకు నిన్న అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌తో ఆయన సమావేశమయ్యారు. ఈ సమావేశానికి ముందు నెతన్యాహు మీడియాతో మాట్లాడుతూ.. "ఇజ్రాయెల్ అమెరికా అధీనంలో పనిచేస్తుందనే లేదా అమెరికా ఇజ్రాయెల్ నిర్ణయాలను ప్రభావితం చేస్తుందనే వాదనలు నిరాధారమైనవే. మా దేశ భద్రత విషయాల్లో ఎవరిపైనా ఆధారపడమని చెప్పాలనుకుంటున్నాను" అన్నారు. గాజాలో అంతర్జాతీయ దళాలను మోహరించాలన్న ప్రతిపాదనలపై ఆందోళన వ్యక్తం చేస్తూ, "ఆ ప్రాంతంలో భవిష్యత్తులో ఎదురయ్యే ముప్పులను తిప్పికొట్టే విషయంలో ఇజ్రాయెల్ స్వయంగా చర్యలు తీసుకునే స్వేచ్ఛ కోల్పోకూడదు" అని పేర్కొన్నారు. ఇజ్రాయెల్ పర్యటనలో ఉన్న జేడీ వాన్స్ కూడా నెతన్యాహుతో సమావేశానికి ముందు విలేకరులతో మాట్లాడుతూ "శాంతి మార్గంలో అనేక సవాళ్లు ఉన్నాయి. హమాస్‌ను నిరాయుధీకరించడం, ఆ సంస్థ ఇకపై ఇజ్రాయెల్‌కు ముప్పుగా మారకుండా చూడడం, గాజాను పునర్నిర్మించడం వంటి పనులు సులభం కాదు. అయినా ఆశావహ దృక్పథంతో ముందుకు సాగుతున్నాం" అన్నారు. హమాస్, ఇజ్రాయెల్‌ల మధ్య జరుగుతున్న కాల్పుల విరమణ ఒప్పందం తాను ఊహించిన దానికంటే మెరుగ్గా సాగుతోందని ఆయన పేర్కొన్నారు.

## వయ్యారి చిత్రం






# సంక్రాంతి రేసులో రాజాసాబ్

బాహుబలి, బాహుబలి-2 చిత్రాలు సాధించిన భారీ విజయాలతో పాన్ ఇండియా స్టార్‌గా ఎదిగిన ప్రభాస్ ఆ తరువాత ఏ సినిమా చేసిన ఇండియా లెవల్‌లో ఆ చిత్రంపై అందరి అటెన్షన్ ఉంటుంది. ఇటీవల 'కల్కి'తో మరో సక్సెస్‌ను తన ఖాతాలో వేసుకున్న ప్రభాస్ ప్రస్తుతం 'రాజాసాబ్' చిత్రంతో పాటు 'ఫౌజీ' చిత్రాల షూటింగ్‌లతో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. కాగా అక్టోబర్ 23న గురువారం ఈ రెబల్‌స్టార్ పుట్టినరోజు సందర్భంగా 'రాజాసాబ్'నుంచి కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేయడంతో పాటు చిత్రాన్ని జనవరి 9న సంక్రాంతి రేసులో విడుదల చేస్తున్నట్లుగా మరోసారి కన్‌ఫర్మ్ చేశారు మేకర్స్. ఈ పోస్టర్ కలర్‌ఫుల్‌గా చూడగానే ఆకట్టుకునే విధంగా ఉంది. మేళతాళాలతో ప్రభాస్‌ను ఊరి ప్రజలు ఆహ్వానిస్తున్నట్లు ఉన్న ఈ పోస్టర్‌ను చూసి ప్రభాస్ ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు. మారుతి దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వ ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇటీవల విడుదలైన టీజర్‌కు కూడా మంచి రెస్పాన్స్ రావడంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ హీరోయిన్స్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి తమన్ సంగీతాన్ని అందిస్తున్నారు.

## నా డివోర్స్‌ను కొందరు సెలబ్రేట్ చేసుకున్నారు

తన వ్యక్తిగత జీవితంలో ఎదురైన కష్టాల సమయంలో కొందరు సంబరాలు చేసుకున్నారంటూ ప్రముఖ నటి సమంత ఆవేదన వ్యక్తం చేశారు. విడాకులు, అనారోగ్య సమస్యలతో తాను తీవ్రంగా బాధపడుతుంటే, తనను ద్వేషించే వాళ్లు ఎగతాళి చేశారని ఆమె ఎమోషనల్ అయ్యారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఆ ఇంటర్వ్యూలో సమంత మాట్లాడుతూ, "నా జీవితంలో ఎన్నో ఒడిదొడుకులు చూశాను. ముఖ్యంగా నాగ చైతన్యతో విడిపోయినప్పుడు, మయోసైటిస్ బారిన పడినప్పుడు కొందరు పైశాచిక ఆనందం పొందారు. నా భవిష్యత్తుపై వారే నిర్ణయాలు తీసుకున్నట్లు మాట్లాడారు.



## ఫౌజీగా ప్రభాస్.. టైటిల్ పోస్టర్ రిలీజ్




రెబల్ స్టార్ ప్రభాస్ తన 46వ పుట్టినరోజు సందర్భంగా అభిమానులకు అదిరిపోయే కానుక ఇచ్చారు. ఆయన హీరోగా, హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రానికి 'ఫౌజీ' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ మేరకు నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ గురువారం అధికారికంగా ప్రకటించింది. దీనికి సంబంధించిన టైటిల్ పోస్టర్‌ను సోషల్ మీడియాలో విడుదల చేయగా, అభిమానుల నుంచి విశేష స్పందన వస్తోంది. గురువారం ప్రభాస్ పుట్టినరోజును పురస్కరించుకుని, నిర్మాణ సంస్థ ఈ ప్రకటన చేసింది. "చరిత్రలోని మరుగునపడిన అధ్యాయాల నుంచి వస్తున్న ఒక సైనికుడి సాహస గాథ ఇది. రెబల్ స్టార్ ప్రభాస్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు" అంటూ పోస్టర్‌ను పంచుకుంది.




## ఓటీటీలో ఓజీ..
# ఫ్యాన్స్ నారాజ్

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన లేటెస్ట్ చిత్రం 'ఓజీ' బాక్సాఫీస్ దగ్గర సెన్సేషనల్ హిట్‌గా నిలిచింది. ఈ సినిమాను దర్శకుడు సుజీత్ పూర్తి గ్యాంగ్‌స్టర్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కించిన తీరు ప్రేక్షకులను మెప్పించింది. పవన్ కళ్యాణ్‌ను అభిమానులు ఎలాగైతే చూడాలని ఆశపడ్డారో, సుజీత్ అదే విధంగా చూపెట్టడంతో ఈ సినిమాకు ఫ్యాన్స్ పట్టం కట్టారు. ఇక బాక్సాఫీస్ దగ్గర రూ.300 కోట్ల మేర గ్రాస్ వసూళ్లు రాబట్టిన ఓజీ, ఇప్పుడు ఓటీటీలో స్ట్రీమింగ్‌కు వచ్చేసింది. ప్రముఖ ఓటీటీ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్‌లో ఈ చిత్రం నేటి నుంచి స్ట్రీమింగ్ అవుతోంది. ఇక ఈ సినిమాను తెలుగుతో పాటు తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో అందుబాటులోకి తీసుకొచ్చారు. అయితే, ఈ సినిమాకు సంబంధించిన అన్‌కట్ వెర్షన్‌ను ఓటీటీ స్ట్రీమింగ్ చేస్తారని అభిమానులు ఆశించారు. కానీ, థియేట్రికల్ వెర్షన్ ఎలాగైతే ఉందో, అదే విధంగా ఓటీటీ వెర్షన్ కూడా ఉండటంతో అభిమానులు కాస్త నిరాశకు లోనవుతున్నారు. డిలీటెడ్ సీన్స్ కూడా యాడ్ చేసి ఉంటే బాగుండేదని వారు ఆశిస్తున్నారు. ఇక ఈ సినిమాలో ఇమ్రాన్ హష్మి, ప్రియాంక మోహన్, ప్రకాష్ రాజ్, శ్రియా రెడ్డి తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటించారు. థమన్ సంగీతం అందించిన ఈ చిత్రాన్ని డివివి ఎంటర్‌టైన్‌మెంట్స్ వారు ప్రొడ్యూస్ చేశారు.

# జాన్వీ.. హ్యాట్రిక్ ఫ్లాప్స్

జాన్వీ కపూర్ బాలీవుడ్‌లో అడుగు పెట్టి ఏళ్లకు ఏళ్లు పూర్తి అవుతున్నా ఇప్పటి వరకు కమర్షియల్ బ్రేక్ దక్కించుకోలేక పోయింది. ఏడు సంవత్సరాల్లో జాన్వీ కపూర్ నటించిన చాలా సినిమాలు హిందీ ప్రేక్షకుల ముందుకు వచ్చాయి. అందులో జాన్వీ కపూర్ పాత్రల గురించి మాట్లాడుకోవడం మనం చూశాం. కానీ ఆయా సినిమాలు కమర్షియల్ విజయాన్ని సొంతం చేసుకోవడం మాత్రం మనం చూడలేక పోయాం. ఆమె కేవలం గ్లామర్ వల్ల ఆఫర్లను సొంతం చేసుకుంటుంది. నెపో కిడ్ కావడం వల్ల కూడా కొన్ని సినిమా ఆఫర్లు ఆమె తలుపు తడుతున్నాయి. ఇప్పటికే బాలీవుడ్‌లో ఆమెపై ఆసక్తి తగ్గింది. పెద్ద సినిమాల్లో ఆమెకు కనీసం ఆఫర్లు రావడం లేదు, చిన్నా చితక సినిమా ఆఫర్లు మాత్రమే ఆమె తలుపు తడుతున్నట్లుగా తెలుస్తోంది. అందుకే ఆమె ఈ మధ్య కాలంలో జాన్వీ కపూర్ హిందీ సినిమాలకు కమిట్ కాలేదని అంటున్నారు. కెరీర్ ఆరంభం నుంచి జాన్వీ కపూర్ సినిమాలు సెట్స్ పై ఉండగానే కొత్త సినిమాలను చేయడం పనిగా పెట్టుకుంది. కానీ జాన్వీ కపూర్ ఇప్పుడు మాత్రం ఒక్క సినిమాకు సైన్ చేయలేదు. ప్రస్తుతం ఆమె చేస్తున్న తెలుగు సినిమా పెద్ది మాత్రమే సెట్స్ పై ఉంది. అది కాకుండా అల్లు అర్జున్ - అట్లీ కాంబో మూవీలోనూ ఈమె కీలక పాత్రలో కనిపించబోతుందని అంటున్నారు. ఆ సినిమాపై అధికారిక ప్రకటన రాలేదు. అది కాకుండా మరే సినిమా గురించి ప్రచారం లేదు, ప్రకటన లేదు. అందుకే జాన్వీ కపూర్ గురించి సోషల్ మీడియాలో ముఖ్యంగా బాలీవుడ్ ప్రేక్షకులు రకరకాలుగా ప్రచారం చేస్తున్నారు. నెట్టింట ఆమె షేర్ చేస్తున్న అందాల ఆరబోత ఫోటోలు వైరల్ అవుతున్నాయి, కానీ ఆమె సినిమాలు మాత్రం ప్రేక్షకులను ఆకట్టుకోలేక పోవడం విచారకం. బాలీవుడ్‌లో జాన్వీ కపూర్ కెరీర్ నిలబడాలి అంటే ఒక సాలిడ్ సక్సెస్ అవసరం ఖచ్చితంగా ఉంది.





## మళ్లీ తండ్రి కాబోతున్న చరణ్

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, ఉపాసన కొణిదెల దంపతుల ఇంట మరోసారి సంతోషం వెల్లివిరిసింది. ఉపాసన రెండోసారి గర్భం దాల్చినట్లు తెలుస్తోంది. ఈ శుభవార్తను ఆమె స్వయంగా సోషల్ మీడియా వేదికగా పంచుకోవడంతో మెగా అభిమానులు ఆనందంలో మునిగిపోయారు. ఇటీవల దీపావళి పండుగ సందర్భంగా తన నివాసంలో జరిగిన వేడుకలకు సంబంధించిన ఒక వీడియోను ఉపాసన పంచుకున్నారు. ఆ వీడియో ద్వారా తాను గర్భవతిననే విషయాన్ని ఆమె సూచనప్రాయంగా వెల్లడించారు. ఈ వార్త బయటకు వచ్చిన కొన్ని రోజులకే, ఆమె కోసం కుటుంబ సభ్యులు సీమంతం వేడుకను ఘనంగా నిర్వహించినట్లు సమాచారం. ఈ కార్యక్రమం అత్యంత సన్నిహితుల సమక్షంలో జరిగినట్టు తెలుస్తోంది. ఈ వేడుకకు మెగా కుటుంబ సభ్యులతో పాటు ఉపాసన తల్లిదండ్రులు, కామినేని కుటుంబ సభ్యులు హాజరయ్యారు. పవర్ స్టార్ పవన్ కల్యాణ్ అర్ధాంగి అన్నా లెజినోవాతో పాటు పలువురు టాలీవుడ్ ప్రముఖులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని ఉపాసన దంపతులను ఆశీర్వదించారు. ప్రస్తుతం ఈ సీమంతం వేడుకకు సంబంధించిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఇది చూసిన అభిమానులు, నెటిజన్లు రామ్ చరణ్, ఉపాసన దంపతులకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.






# సెమీస్‌లోకి ఘనంగా..!

**న్యూజిలాండ్‌పై టీమిండియా ఘన విజయం.. ఐదోసారి సెమీస్‌లో భారత మహిళల జట్టు**

హ్యాట్రిక్ ఓటములు.. సెమీస్ ఆశలు ఆవిరవుతున్నవేళ అందరిలో ఆందోళన.. గెలుపే శరణ్యం అయిన మ్యాచ్‌లో భారత జట్టు పంజా విసిరింది. బ్యాటింగ్. బౌలింగ్. ఫీల్డింగ్ విభాగాల్లో అదరగొట్టింది. ఓపెనర్లు ప్రతీకా రావల్(122), స్మృతి మంధాన(109)లు శతకాలతో కదం తొక్కగా.. సమిష్టిగా రాణించి న్యూజిలాండ్ బ్యాటర్లకు కళ్లెం వేసింది.

325 పరుగుల ఛేదనలో ప్రత్యర్థిని కట్టడి చేసి ..డక్‌వర్త్ లూయిస్ ప్రకారం 53 పరుగుల తేడాతో గెలుపొంది ఐదోసారి సెమీస్‌కు దూసుకెళ్లింది. మహిళల వన్డే వరల్డ్ కప్‌లో ఫేవరెట్ భారత జట్టు.. అదిరే విజయంతో సెమీస్‌లో అడుపెట్టింది.

**వరుసగా మూడు ఓటముల నుంచి తేరుకున్న టీమిండియా.. భారీ స్కోర్‌తో న్యూజిలాండ్‌ను ఒత్తిడిలోకి నెట్టింది. వర్షం అంతరాయంతో వైట్ ఫెర్న్స్ లక్ష్యాన్ని 44 ఓవర్లలో 325 పరుగులుగా నిర్దేశించారు.**

బ్యాటర్ల విధ్వంసంతో న్యూజిలాండ్‌కు భారీ లక్ష్యాన్ని నిర్దేశించిన భారత్ వికెట్ల వేట మొదలెట్టింది. యువ పేసర్ క్రాంతి గౌడ్ తన తొలి ఓవర్లోనే వికెట్ అందించింది. పెద్ద షాట్ ఆడే తొందరలో కివీస్ ఓపెనర్ సుజీ బేట్స్(1) బంతిని గాల్లోకి లేపింది. కవర్స్‌లో ఫీల్డింగ్ చేస్తున్న ప్రతీక రావల్ ఒడుపుగా క్యాచ్ అందుకోగా.. ఒక్క పరుగు వద్దే వైట్ ఫెర్న్స్ తొలి వికెట్ కోల్పోయింది. అనంతరం అమేలియా కేర్ (45 ).. జార్జియా పిమ్మర్(30)లు ఆచితూచి ఆడారు. రేణుకా సింగ్ వేసిన 8వ ఓవర్లో ప్లిమ్మర్ రెండు, కేర్ ఒక ఫోర్ బాదారు. ఆ తర్వాత స్నేహ్ రానా ఓవర్లో సిక్సర్ కొట్టిన ప్లిమ్మర్ చివరకు రేణుక ఓవర్లో క్లీన్ బౌల్డ్ అయింది. క్రీజులోకి వస్తూనే బౌండరీతో ఖాతా తెరిచిన కెప్టెన్ సోఫీ డెవినె(4) సైతం రేణుకా ఓవర్లో బౌల్డ్ కావడంతో కివీస్ కష్టాల్లో పడింది. అమేలియా, బ్రూక్ హల్లిడే(81)లు విలువైన రన్స్ జోడించి స్కోర్ వంద దాటించారు. రానా ఓవర్లో మంధాన స్టన్నింగ్ క్యాచ్‌తో అమేలియా ఔటయ్యింది. మళ్లిడే పట్టుదలగా ఆడిన . స్వీప్, పవర్‌ఫుల్ షాట్లతో చెలరేగి అర్ధ శతకంతో మెరిసింది. ఆరో వికెట్‌కు ఇసబెల్లా గేజ్(65 నాటౌట్)తో కలిసి 72 రన్స్ రాబట్టిన ఆమెను శ్రీచరణి పెవిలియన్ పంపింది. అయినా కూడా ఇస్ కేర్(18), గేజ్ ధనాధన్ ఆడుతూ స్కోర్ 260 దాటించారు. చివరి బంతికి రోస్‌మెరీ(1) ఔట్ కావడంతో 53 పరుగుల తేడాతో గెలుపొందిన టీమిండియా సెమీస్‌లో అడుపెట్టింది. చావోరేవో పోరులో భారత బ్యాటర్లు దంచేశారు. ఓపెనర్లు ప్రతీకా రావల్ (122), స్మృతి మంధాన(109) న్యూజిలాండ్ బౌలర్లను విసిగిస్తూ శతకాలతో రెచ్చిపోయారు. వరల్డ్ కప్ చరిత్రలోనే రికార్డు భాగస్వామ్యంతో భారీ స్కోర్‌కు గట్టి పునాది వేశారిద్దరూ. రెండొందలు జోడించిన ఈ ద్వయం వెనుదిరిగాక. జెమీమా రోడ్రిగ్స్(76 నాటౌట్) విధ్వంసక హాఫ్ సెంచరీతో స్కోర్‌బోర్డును ఉరికించింది. వర్షం అంతరాయంతో మ్యాచ్‌ను 49వ ఓవర్లకు కుదించగా.. జెమీమా, రీచా ఘోష్(4 నాటౌట్) చెరొక బౌండరీ కొట్టడంతో.. టీమిండియా ప్రత్యర్థికి 341 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది.

## కివీస్‌ను దెబ్బకొట్టిన వర్షం

**ఆకరి టీ20 రద్దు.. సిరీస్ విజేతగా ఇంగ్లండ్**

స్వదేశంలో జరుగుతున్న టీ20 సిరీస్‌ను న్యూజిలాండ్ కోల్పోయింది. వర్షం కారణంగా మూడో మ్యాచ్ రద్దు కావడంతో రెండో టీ20 గెలుపొందిన ఇంగ్లండ్ ట్రోఫీని తన్నుకుపోయింది. తొలి మ్యాచ్ వర్షార్పణం కాగా.. రెండో మ్యాచ్‌లో ఇంగ్లండ్ జయభేరి మోగించింది. దాంతో.. సిరీస్ విజేతను నిర్ణయించే మూడో గేమ్‌లో పర్యాటక జట్టుకు చెక్ పెట్టాలని కివీస్ భావించింది. కానీ, వరుణుడు ఆతిథ్య జట్టు ఆశలపై నీళ్లు చల్లుతూ మ్యాచ్ సాగనివ్వలేదు. దాంతో.. అంపైర్లు ఆటను రద్దు చేయగా.. 1-0తో హ్యారీ బ్రేక్ సారథ్యంలోని



ఇంగ్లండ్ పొట్టి సిరీస్‌ను ఎగరేసుకుపోయింది. ఆక్లాండ్ వేదికగా ప్రారంభమైన మూడో టీ20లో న్యూజిలాండ్ ఓపెనర్లు దూకుడుగా ఆడారు. భారీ స్కోర్‌తో ఇంగ్లండ్‌ను ఒత్తిడిలో పడేయాలనుకున్నారు. కానీ, 3.4 ఓవర్ సమయంలోనే వర్షం అందుకుంది. అప్పటికి కివీస్ స్కోర్.. 38-1. వర్షం తగ్గితే ధనాధన్ దంచేసి మ్యాచ్‌ను తమ ఆధీనంలోకి తీసుకోవాలని భావించింది ఆతిథ్య జట్టు. కానీ, వాన ఎంతకూ తగ్గకపోవడంతో అంపైర్లు ఇరుజట్ల కెప్టెన్లతో మాట్లాడి ఆటను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. దాంతో.. క్రిస్ట్‌చర్చిలో జరిగిన రెండో టీ20లో గెలుపొందిన ఇంగ్లండ్ సిరీస్ విజేత అయింది. ఆ మ్యాచ్‌లో అర్ధ శతకంతో కదం తొక్కి జట్టు విజయంలో కీలకమైన హ్యారీ బ్రూక్ 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డు అందుకున్నాడు. పొట్టి సిరీస్ ముగియడంతో ఇంగ్లండ్, న్యూజిలాండ్ మధ్య అక్టోబర్ 26 నుంచి వన్డే సిరీస్ ప్రారంభం కానుంది. బే ఓవల్‌లో మొదటి మ్యాచ్‌లో ఇరుజట్లు తలపడనున్నాయి.




## చెత్త ఫీల్డింగ్ వల్లే ఓడాం

మేం పోరాడే లక్ష్యాన్నే నమోదు చేశాం. కానీ కీలక క్యాచ్‌లు వదిలేస్తే ఎంత పెద్ద లక్ష్యం ఉన్నా కాపాడుకోలేం. తొలి మ్యాచ్‌లో టాస్ గెలవడం కీలకం. కానీ ఈ మ్యాచ్‌లో టాస్ అంత కీలకం కాదు. ఎందుకంటే ఇరు జట్లు 50 ఓవర్లు ఆడాయి. 15-20 ఓవర్ల తర్వాత వికెట్ సెటిల్ అయ్యింది. రోహిత్ శర్మ అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. సుదీర్ఘ విరామం తర్వాత వచ్చి ఇలాంటి ఇన్నింగ్స్ ఆడటం అంత సులువు కాదు. మ్యాచ్ ఆరంభంలో పిచ్ బ్యాటింగ్‌కు సవాలుగా ఉంది. కానీ రోహిత్ అద్భుతంగా ఆడాడు. నా అభిప్రాయం ప్రకారం అతను పెద్ద ఇన్నింగ్స్‌ను చేజార్చుకున్నాడు.

**- శుభ్‌మన్ గిల్**

# సెలక్టర్లను నమ్మాలి

**సర్ఫరాజ్‌కు ఇర్ఫాన్ సూచన**



దక్షిణాఫ్రికా-ఏతో రెండు టెస్టులు ఆడేందుకు భారత ఏ జట్టును బీసీసీఐ సెలక్షన్ కమిటీ ఇటీవల ప్రకటించింది. రిషభ్ పంత్‌ను సారథిగా నియమించింది. సర్ఫరాజ్ ఖాన్‌కు అవకాశం కల్పించకపోవడంతో తీవ్రస్థాయిలో చర్చ మొదలైంది. ఒకానొక దశలో ఇది రాజకీయంగానూ దారితీసింది. అతడి పేరు వల్లే అవకాశం రావడం లేదంటూ కాంగ్రెస్ - బీజేపీ నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో భారత మాజీ క్రికెటర్ ఇర్ఫాన్ పఠాన్ కీలక వ్యాఖ్యలు చేశాడు. సెలక్టర్లపై నమ్మకం ఉంచాలని.. కొన్ని ప్రణాళికలు ఉంటాయని వ్యాఖ్యానించాడు. "సెలక్టర్లు, కోచ్, మేనేజ్‌మెంట్.. ఎవరికైనా సరే నిర్దిష్టమైన ఆలోచనలు ఉంటాయి. కొన్నిసార్లు అభిమానులకు అవి తప్పుగా కనిపిస్తాయి. అయితే, ప్రతి విషయాన్ని గుచ్చిగుచ్చి చూడాల్సిన అవసరం లేదు. నిజాన్ని దాచిపెట్టేలా కొత్త కథనాలు సృష్టించొద్దు" అని ఇర్ఫాన్ పోస్టు పెట్టాడు.

**కమ్యూనికేషన్ బాగుండాలి: అశ్విన్**

"ఆటగాళ్లకు, బోర్డుకు మధ్య సరైన కమ్యూనికేషన్ ఉండాలి. లేకపోతే ఇలాంటి అయోమయ పరిస్థితులే ఎదురవుతాయి. ఈ సందర్భంగా నాకు సుబ్రమణియన్ బద్రినాథ్ గుర్తుకొస్తాడు. అతడు భారత్ ఏ తరపున చాలా మ్యాచులు ఆడాడు. సారథిగానూ వ్యవహరించాడు.

# కోహ్లి మళ్లీ.. సున్నా!

**రెండో వన్డేలోనూ టీమిండియా ఓటమి.. సిరీస్ ఆస్ట్రేలియా కైవసం**

**రోహిత్ శర్మ, శ్రేయస్ అర్ధశతకాలు వృథా.. 4 వికెట్లతో జంపా భారత్ పతనం**

**ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న భారత క్రికెట్ జట్టుకు నిరాశ ఎదురైంది. అడిలైడ్ ఓవల్ వేదికగా గురువారం జరిగిన రెండో వన్డేలో టీమిండియా 2 వికెట్ల తేడాతో ఓటమి పాలైంది. ఈ విజయంతో, మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను ఆస్ట్రేలియా మరో మ్యాచ్ మిగిలుండగానే 2-0 తేడాతో కైవసం చేసుకుంది.**

భారత బౌలర్లు చివరి వరకు పోరాడినప్పటికీ, కీలక సమయంలో ఆసీస్ బ్యాటర్లు రాణించడంతో ఫలితం ప్రతికూలంగా వచ్చింది. టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న ఆస్ట్రేలియా, భారత జట్టును నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 264 పరుగులకే పరిమితం చేసింది. భారత ఇన్నింగ్స్‌కు ఆరంభంలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (9), విరాట్ కోహ్లి (0) త్వరగా ఔటవ్వడంతో 17 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో రోహిత్ శర్మ (97 బంతుల్లో 73), శ్రేయస్ అయ్యర్ (77 బంతుల్లో 61) బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్‌లతో జట్టును ఆదుకున్నారు. వీరిద్దరూ మూడో వికెట్‌కు 118 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. ఆ తర్వాత అక్షర్ పటేల్ (41 బంతుల్లో 44) వేగంగా ఆడటంతో భారత్ గౌరవప్రదమైన స్కోరు చేయగలిగింది. ఆస్ట్రేలియా బౌలర్లలో ఆడమ్ జంపా 4 వికెట్లతో చెలరేగగా, జేవియర్ బార్ట్‌లెట్ 3, మిచెల్ స్టార్క్ 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం 265 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆస్ట్రేలియా 46.2 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి విజయాన్ని అందుకుంది. ఛేదనలో ఆసీస్‌కు కూడా శుభారంభం దక్కలేదు. అయితే, మాథ్యూ షార్ట్ (78 బంతుల్లో 74 పరుగులు) కీలక ఇన్నింగ్స్‌తో జట్టును గెలుపు బాటలో నడిపించాడు. మధ్యలో వికెట్లు పడుతున్నా, యువ ఆటగాడు కూపర్ కనోలీ (53 బంతుల్లో 61 రన్స్ నాటౌట్) అద్భుతమైన ఇన్నింగ్స్‌తో చివరి వరకు నిలిచి జట్టును గెలిపించాడు. అతనికి మిచెల్ ఓవెన్ (23 బంతుల్లో 36 రన్స్) మెరుపు ఇన్నింగ్స్ తోడవడంతో ఆసీస్ విజయం సులభమైంది. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా, వాషింగ్టన్ సుందర్ తలో రెండు వికెట్లు తీశారు. సిరాజ్, అక్షర్ పటేల్‌కు చెరొక వికెట్ దక్కింది. ఈ విజయంతో సిరీస్‌ను ఆసీస్ సొంతం చేసుకోగా, చివరి మ్యాచ్ నామమాత్రంగా మిగిలింది. ఇరుజట్ల మధ్య మూడో వన్డే అక్టోబరు 25న సిడ్నీలో జరగనుంది.



## కోహ్లి.. 17 ఏళ్లలో తొలిసారి

టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి మరోసారి నిరాశపర్చాడు. వరుసగా రెండో మ్యాచ్‌లోనూ డకౌట్‌గా వెనుదిరిగాడు. ఆస్ట్రేలియాతో అడిలైడ్ వేదికగా జరుగుతున్న రెండో వన్డేల్లో కోహ్లి పరుగులు చేయకుండానే వెనుదిరిగాడు. గ్జేవియర్ బార్ట్‌లెట్ బౌలింగ్‌లో ఎల్బీగా పెవిలియన్ చేరాడు. పెర్త్ వేదికగా జరిగిన తొలి వన్డేలోనూ కోహ్లి డకౌట్ అయిన సంగతి తెలిసిందే. ఆ మ్యాచ్‌లో 8 బంతులాడిన కోహ్లి.. తాజా మ్యాచ్‌లో 4 బంతులకే వెనుదిరిగాడు. తన 17 ఏళ్ల వన్డే క్రికెట్‌లోనే విరాట్ కోహ్లి వరుసగా రెండు మ్యాచ్‌ల్లో డకౌటవ్వడం ఇదే తొలిసారి. సుదీర్ఘ విరామం తర్వాత బరిలోకి దిగిన విరాట్ కోహ్లి వరుసగా రెండు మ్యాచ్‌ల్లో డకౌటవ్వడం అభిమానులను తీవ్రంగా నిరాశపర్చింది. 13 ఏళ్ల తర్వాత ఆసీస్‌పై తొలి సారి డకౌట్ అయిన కోహ్లి.. వరుసగా రెండో మ్యాచ్‌లోనూ సున్నాకే వెనుదిరిగాడు. ఇప్పటి వరకు 31 వన్డేలు ఆడిన కోహ్లి.. గత రెండు మ్యాచ్‌ల్లోనే డకౌటయ్యాడు. ఓవరాల్‌గా కోహ్లికి ఇది 40వ డకౌట్. మూడు ఫార్మాట్లలో కలిసి 552 మ్యాచ్‌లు ఆడిన కోహ్లి 40 సార్లు పరుగుల ఖాతా తెరవకుండా వెనుదిరిగాడు.

ఈవార్తలు ప్రజావాణి
సంపాదకీయం
నేటి ఈవార్తలు
శుక్రవారం 24-10-2025 | www.evarthalu.com



# ఐరాస.. పనైపోయింది!

**రెండవ ప్రపంచ యుద్ధం నేర్పిన గుణపాఠాలను పునాదులుగా చేసుకొని 26 జూన్ 1945 రోజున 51 దేశాల నిర్ణయం ఫలితంగా విశ్వశాంతిని కోరుతూ 24 అక్టోబర్ 1945 రోజున ఐక్యరాజ్యసమితి స్థాపించడం అనివార్యంగా జరిగింది. 'యునైటెడ్ నేషన్స్ (యూఎన్)' అనే పదాన్ని అప్పటి అమెరికా అధ్యక్షుడు ఫ్రాంక్లిన్ రూజ్‌వెల్ట్ రూపొందించారు. అమెరికాలోని న్యూయార్క్ ప్రధాన కేంద్రంగా ప్రారంభమైన ఐక్యరాజ్యసమితిలో నేడు 193 (రెండు పరిశీలన దేశాలుగా ఉండగా) దేశాలు సభ్యత్వాన్ని కలిగి ఉన్నాయి. స్వతంత్ర దేశాలుగా గుర్తింపు పొందని నార్త్ సైప్రస్, సోమాలిల్యాండ్, అబ్కాజియా లాంటి రాజ్యాలకు ఐక్యరాజ్యసమితి సభ్యత్వం ఇవ్వలేదు. వాటికన్ సిటీ, పాలస్తీనాలు సభ్యత్వాన్ని పొందలేదు.**

గత 77 సంవత్సరాలుగా ప్రపంచ దేశాల మధ్య మధ్యవర్తిత్వం వహిస్తూ, పలు వివాదాల పరిష్కారానికి నిర్విరామం కృషి చేస్తూ, మానవాళికి కరోనా మహమ్మారి లాంటి ప్రకృతి విపత్తు జరిగినపుడు ప్రజలను చైతన్య పరిచే ఐక్యరాజ్యసమితి 'ప్లాటినమ్ జుబ్లీ వేడుకలు' చేసుకునే స్థాయికి ఎదగడం విశ్వజనావళికి సంతోషదాయకం. అత్యవసర సమయాల్లో సత్వరమే స్పందిస్తూ, ప్రపంచ దేశాలకు తగు పరిష్కారాలను సూచిస్తూ, ప్రపంచశాంతి స్థాపన యజ్ఞంలో తన వంతు బాధ్యతలను నిర్వహిస్తున్న ఐక్యరాజ్యసమితి సేవలు ప్రశంసనీయమని కొనియాడబడుతున్నది. అంతర్జాతీయ శాంతి స్థాపనలో ప్రధాన భూమిక నిర్వహిస్తున్న యుయన్ఓ భద్రతా మండలి (సెక్యూరిటీ కౌన్సిల్)లో ఐదు అగ్రరాజ్యాలు అమెరికా, రష్యా, యుకె, ఫ్రాన్స్, చైనాలు శాశ్వత సభ్యులుగా వీటో పవర్‌ను కలిగి ఉండడం ఐక్యరాజ్యసమితి బలం, బలహీనత కూడా అవుతున్నది. భద్రతా మండలిలో మరో 10 దేశాలకు 2 సంవత్సరాల వ్యవధితో తాత్కాలిక వీటో లేని సభ్యత్వాన్ని కల్పిస్తారు. మిగిలిన 188 ఐక్యరాజ్యసమితి సభ్యదేశాల అభిప్రాయాలకు ప్రాధాన్యం లేదు, వారి అభిమతానికి విలువ ఉండడం లేదు. ప్రస్తుత సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్ ముఖ్య పరిపాలనాధికారిగా సేవలందిస్తున్న ఐక్యరాజ్యసమితి సంస్థ నిర్దేశిత నియమాలను తీవ్రంగా ఉల్లంఘించిన దేశాలను భద్రతా మండలి సిఫార్సుతో జనరల్ అసెంబ్లీ ఆయా దేశాల సభ్యత్వాన్ని రద్దు కూడా చేయవచ్చు. ఐక్యరాజ్యసమితి ప్రధాన విధుల్లో అంతర్జాతీయ శాంతి, భద్రతల స్థాపన, దేశాల మధ్య స్నేహ బంధాలను నెలకొల్పడం జరుగుతున్నది. దేశాల మధ్య నెలకొన్న ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, మానవీయ సమస్యకు పరిష్కారాలు చూపుతూ, మానవ హక్కులను కాపాడుతూ మౌలిక స్వేచ్ఛను కల్పించడం జరుతున్నది. విశ్వ మహమ్మారి విజృంభణ వేళ ప్రజలను జాగృత పరచడం, పర్యావరణ కాలుష్య నియంత్రణ, భూగోళాన్ని పరిరక్షించడం లాంటి అతి ముఖ్యమైన అంశాలలో ప్రపంచ దేశాలను చైతన్య పరచడం జరుగుతున్నది. దేశాల మధ్య సమానత్వం, నమ్మకాలను గౌరవించడం, సరిహద్దు వివాదాలను శాంతియుతంగా పరిష్కరించడం లాంటి సూత్రాల ఆధారంగా ఐక్యరాజ్యసమితి పని చేస్తున్నది. ఆవిర్భావం నుంచి నేటి వరకు ఐక్యరాజ్యసమితి నిర్వహించిన పాత్ర ప్రశంసనీయంగా ఉంటూనే కొన్ని సందర్భాలలో నిరాశనే మిగిల్చిందని చరిత్ర చెబుతోంది. అనేక ఆటంకాలు, సవాళ్ల నడుమ తన ఉనికిని చాటుకుంటూ, ప్రపంచ దేశాలలో శాంతి స్థాపన దిశగా అడుగులు వేస్తున్నది. ఐక్యరాజ్యసమితి చరిత్రలో ఎన్ని మైలు రాళ్ళు దాటినా, కొన్ని విషమ పరిస్థితులలో తగు న్యాయం చేయలేకపోయిందనే విమర్శలను మూటకట్టుకుంది. అమెరికా, ఇరాక్ దేశాల మధ్య వివాదం, సూడాన్‌లో అమాయక ప్రజల మరణాలను అరికట్టడంలో ఐక్యరాజ్యసమితి విఫలమైందని తెలుస్తున్నది. 24 ఫిబ్రవరి 2022న ప్రారంభమై గత 19 మాసాలుగా కొనసాగుతూ ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలను కుదిపేస్తున్న భీకర ఉక్రెయిన్, -రష్యా యుద్ధాన్ని నిలువరించడంలో ఐక్యరాజ్యసమితి తీసుకున్న చొరవ నామమాత్రమే అని విదితమవుతున్నది. 07 అక్టోబర్ 2023న ఇజ్రాయెల్ ఆవాసాలపై హమాస్ భీకర ఆకస్మిక దాడులతో మొదలైన యుద్ధంలో ఇజ్రాయెల్ పక్షాన కనీసం 1,400 ప్రాణాలు(240 ఇజ్రాయెలీలను బంధించి హమాస్ తమ ఆధీనంలోకి తీసుకోవడం), గాజా నగరంపై ఇజ్రాయెల్ దాడుల్లో గత నెల రోజులుగా దాదాపు 9,700 (అందులో 4,800 మంది పిల్లలు) వరకు మరణాలు నమోదు అయ్యాయి. ఇజ్రాయెల్, హమాస్ పోరాటంలో గత నెల రోజులుగా గాయపడిన వారి సంఖ్య 50 వేలు దాటి ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. సోవియట్ యూనియన్ విచ్ఛిన్నం తరువాత నెలకొన్న యుఎస్ ఆధిపత్యం దాదాపు 15 ఏండ్ల పాటు కొనసాగడం చూశాం. 2008 తరువాత అఫ్ఘానిస్థాన్, ఇరాన్ విషయాల్లో అమెరికా ఆధిపత్య చర్యలు చైనాకు నచ్చకపోవడంతో భద్రతా మండలి దేశాల మధ్య విభేదాలు బయటపడడం చూశాం. చైనా క్రమంగా బలపడడంతో యుఎస్ ఆధిపత్యం తగ్గుతూ రెండు దేశాల మధ్య ప్రచ్ఛన్న యుద్ధ వాతావరణం నెలకొని, నేడు జరుగుతున్న రెండు యుద్ధాల పరిష్కారంలో ఇరుపక్షాలు ఉత్తర దక్షిణ ధ్రువాలుగా దూరం జరగడం పెద్ద సమస్యగా నిలుస్తున్నది. ఈ పోరాటాన్ని శాంతింపజేయడం, కాల్పుల విరమణ అంగీకారానికి ఇరు దేశాలను ఒప్పించడంలో ఐక్యరాజ్యసమితి పెద్దన్న పాత్రను పోషించడంలో విఫలం అయినట్లు కనిపిస్తున్నది. అమెరికా, చైనాల మధ్య నెలకొన్న ప్రచ్ఛన్న యుద్ధ వాతావరణం ఐక్యరాజ్యసమితి లక్ష్యాలను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. నేడు భద్రతా మండలిలో ఏకాభిప్రాయం రావడం అసాధ్యంగా తోస్తున్నది. ముఖ్యంగా దేశాల మధ్య సంఘర్షణలు తారస్థాయికి చేరినపుడు భద్రతా మండలి తీర్మానం లేకుండా ఏకాభిప్రాయానికి రావడం జరగదని మనకు తెలుసు. అగ్రరాజ్యాల ఆధిపత్య ధోరణిలతో ఐక్యరాజ్యసమితి కార్యదక్షత అయోమయంలో పడుతున్నదని, ప్రపంచ శాంతి స్థాపనకు ఐక్యరాజ్యసమితి చేస్తున్న ప్రయత్నాలు దాదాపు శూన్యమే అని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఆయుధాలతో అగ్రరాజ్య స్థాయి సాధ్యపడదని, విశ్వమానవాళికి సుఖసంతోషాలు పంచగలగడమే పెద్దరికం అవుతుందని భద్రతా మండలి దేశాలు గుర్తించాలి. ప్రపంచ శాంతిస్థాపనలో ఐక్యరాజ్యసమితి పెద్దన్నలా నిలబడి, దేశాల మధ్య విభేదాలను చెరిపి, సహకార భావనను పెంచి, ప్రపంచ కుగ్రామాన్ని సుందర ఆవాస ప్రదేశంగా నిర్మించాలని ఆశించాల్సిన అవసరం ఉంది.




## ఉత్సవ విగ్రహమే..!

ఇటీవల పరిణామాలను చూస్తే ఎవరికైనా ఐక్యరాజ్యసమితి ఉత్సవ విగ్రహంగా మారుతోందనే అభిప్రాయం కలుగక మానదు. యుద్ధ జ్వాలల నుంచి తమను తాము కాపాడుకోవడానికి, శాంతి యుత ప్రపంచ స్థాపనకు మానవులలో ఉన్న అకుంఠిత ఆశయాలే ఐక్యరాజ్యసమితి వంటి అంతర్జాతీయ సంస్థ స్థాపనకు దారి తీశాయి. మొదటి ప్రపంచ యుద్ధం ముగియడంతో 'నానాజాతి సమితి'ని ఏర్పాటు చేసి ప్రపంచ శాంతిని పరిరక్షించే బాధ్యతను దానికి కట్ట బెట్టాయి పెద్ద రాజ్యాలు. ఈ సమితి ఎన్నో రకాల శాంతి మార్గాలను సూచిస్తూ అందులో ముఖ్య మైనదిగా... నిరాయుధీకరణంను సూచించింది.

దానిని పెడచెవిన పెట్టిన ప్రపంచ దేశాలు ఆయుధాలను సమీకరించుకొని ఆధిపత్య పోరు మొదలు పెట్టి, రెండవ ప్రపంచ యుద్ధం ముంగిట మాన వాళి మరోసారి నిలబడేలా చేశాయి. యుద్ధం ముగిసిన వెంటనే నానాజాతి వైఫల్యం వల్లనే రెండో ప్రపంచ యుద్ధం జరిగిందని భావించి... దాని స్థానంలో ఐక్యరాజ్య సమితిని ఏర్పాటు చేశాయి ప్రపంచ దేశాలు. ఇక్కడ గమనించవలసిన విషయమేమిటంటే... మొదటి, రెండవ ప్రపంచ యుద్ధాల ముందు ఆయా దేశాలు యుద్ధం రాబోతుందని గ్రహించి శాంతి సభలు నిర్వహించడం, చర్చలు జరపటం జరి పాయి. సంధులు చేసుకున్నాయి. అయినా ప్రపంచ యుద్ధాలు ఆగలేదు. ఇప్పుడు ఐక్యరాజ్యసమితిలో సభ్యులుగా 193 దేశాలు ఉన్నాయి. ఇందులో వీటో అధికారం ఉన్న 5 అగ్ర రాజ్యాలు ఉన్నాయి. 25 రకాలుగా పనిచేసే వివిధ రకాల సంస్థలు,అంతర్జాతీయ న్యాయస్థానం ఐక్యరాజ్యసమితి కింద పని చేస్తున్నాయి. అయినా కూడా రగిలిపోతున్న యుద్ధాలను ఆపలేకపోవడం బాధాకరం. అలా అని ఐక్యరాజ్యసమితి సాధించిన విజయాలు లేవని కాదు. రష్యా%-%ఇరాన్ , ఫ్రాన్స్%-% సిరియా%-% లెబనాన్, ఇండోనేషియా సమస్య, ఈజిప్ట్ అంశం, చెకోస్లావేకియా అంశం... ఇలా ఐక్యరాజ్యసమితి మధ్యవర్తిత్వంలో శాంతి ఒప్పందాల ద్వారా సమస్య లను పరిష్కరించుకున్న ఉదంతాలు చాలానే ఉన్నాయి. అలాగే అభివృద్ధి చెందుతున్న దేశాలకు వివిధ రకాల సాయం అందడానికీ ఐక్యరాజ్యసమితి ఎంతగానో కృషి చేస్తోంది. ఎన్ని విజయాలు సాధించినప్పటికీ ఐక్యరాజ్య సమితి అగ్రరాజ్యాల జోలికి రానంతవరకే సంస్థకు గౌరవం దక్కుతోంది. ఆ మేరకే దానికి ఆర్థిక వనరులు అందుతున్నాయి. అంతర్జాతీయ శాంతికి అడ్డంకిగా మారిన అణ్వాయుధాల తయారీ, విని యోగానికి అగ్ర రాజ్యాలు స్వస్తి పలకవలసిందిగా యూఎన్ఓ విజ్ఞప్తి చేసినప్పటికీ అవి పెడచెవిన పెడుతున్నాయి. పైగా ప్రస్తుత తరుణంలో అగ్ర రాజ్యాల షాడో దేశాల మధ్య యుద్ధం మొదలై ఆయుధ గోడౌన్ల తలుపులు తెరుచుకుంటున్నాయి. అగ్ర రాజ్యాల ప్రోద్బలంతోనే ఇవి బరిలో దిగిన ప్పుడు ఇంకా ఐక్యరాజ్యసమితి మాట వినే పరిస్థితి లేదనిపించక మానదు. ఐక్యరాజ్యసమితి సెక్రెటరీ జనరల్ అయిన ఆంటోనియో గుటెరస్‌ను తమ దేశంలోకి రాకుండా బహిష్కరిస్తున్నాం అంటున్న ఇజ్రాయెల్‌కు అగ్రరాజ్యమైన అమెరికా, బ్రిటన్లు మద్దతుగా ఉన్న విషయం తెలిసిందే. గాజాను పూర్తిగా నేల మట్టం చేసి, లెబనాన్‌ను పావు వంతు ఆక్రమించి, ఇరాన్‌పై పూర్తిస్థాయిలో యుద్ధానికి సిద్ధం అవు తున్న ఇజ్రాయిల్‌ను అగ్రరాజ్యాలు నిలువరించ లేకపోతున్నాయి. ఓ పక్క ఇజ్రాయెల్‌పై దాడి చేస్తూనే అరబ్ దేశాలను ఏకం చేయడానికి ఇరాన్ ముమ్మర ప్రయత్నాలు చేస్తుంటే ఐక్యరాజ్యసమితి ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉండిపోవాల్సి వస్తోంది. అంతేకాకుండా ఉక్రెయిన్ విషయంలో కూడా అగ్రరాజ్యాలు గ్రూపులుగా సంఘటిత మవుతూ ఉంటే ఐక్యరాజ్యసమితి ఏమి చేయలేక చూస్తూ ఉండిపోతోంది. ఈ పరిస్థితులను చూస్తుంటే ఏ ఆశయాలతో అయితే ఐక్యరాజ్య సమితిని స్థాపించారో... వాటిని సాధించలేని స్థితికి ఐక్యరాజ్యసమితి చేరుకుందని చెప్పక తప్పదు.

### ఇటీవలి కాలంలో ఐరాస వైఫల్యాలు:

- గాజా యుద్ధంలో శాంతి రక్షణ వైఫల్యం: ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి యుద్ధాన్ని ఆపలేకపోవడం, సివిలియన్ల రక్షణకు పరిమితి. యూఎన్ఆర్‌డబ్ల్యూఏ సిబ్బందిపై ఆరోపణలు (హమాస్‌కు సహకారం) కారణంగా 9 దేశాలు నిధులు నిలిపివేశాయి.
- సుడాన్ సంఘర్షణలో జోక్యం లేకపోవడం: సుడాన్ యుద్ధం (2023 నుండి)లో శాంతి చర్చలు విఫలంబీ ఆహార అభద్రత, వలసలు పెరగడం. బాధ్యతా రక్షణ సూత్రం అమలు కాకపోవడం.
- ఆఫ్రికాలో శాంతి రక్షణ మిషన్ల వైఫల్యాలు: మాలి, కాంగో, సోమాలియా మిషన్లు విఫలంబీ ఆర్థిక సమస్యలు, స్థానిక ప్రతిఘటనలు. మాలిలో మిషన్ మూసివేత, ఆఫ్రికన్ యూనియన్‌కు మార్పు.
- యుక్రెయిన్ యుద్ధంలో పరిమిత ప్రభావం: రష్యా-యుక్రెయిన్ యుద్ధంలో భద్రతా మండలి విభేదాలు (అమెరికా-రష్యా)బీ శాంతి చర్చలు విఫలం అయ్యాయి.
- యెమెన్‌లో హౌతీలపై వైఫల్యాలు: వెసెల్ ఇన్‌స్పెక్షన్ పరిశీలనలు బలవంతం లేకపోవడంబీ 40కి పైగా ఐరాస సిబ్బంది అరెస్టులు.
- జెనోసైడ్ నివారణలో వైఫల్యం: గాజా, సుడాన్, సిరియాలో ఆహార నిలిపివేతను అడ్డుకోకపోవడం మాజీ యూఎన్ అధికారి గాజాను జెనోసైడ్‌గా పిలవకపోవడంపై ఆరోపణలు.
- భద్రతా మండలి స్థిరత్వ లేకపోవడం: 2024లో 46 రిజల్యూషన్లు మాత్రమే (2023 కంటే తగ్గుదల)బీ అమెరికా, రష్యా, చైనా మధ్య విభేదాలు.

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.